ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

సోమవారం 21 జూలై 2025





వరదలున్నా.. వెలవెలే...!

నెల్లూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలతో కృష్ణా, గోదావరి నదుల పరివాహకాలు కళకళలాడుతున్నాయి. పెన్నా పరివాహకం మాత్రం వెలవెలబోతోంది. కృష్ణా జలాలను సోమశిలకు తరలించే అవకాశం ఉన్నా, దాన్ని వినియోగించు కోవడం లేదు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో కృష్ణాజలాలు జిల్లాకు రావడం లేదు. రోజుకు 10 వేలకుపైగా క్యూసెక్కుల నీటిని సోమశిలకు తరలించేందుకు వీలున్నా, 3,300 క్యూసెక్కులకు మించి రావడం లేదు. కృష్ణా పరివాహకంలో ఈ ఏడాది వర్షాలు ముందుగానే కురిశాయి. దీంతో శ్రీశైలం జలాశయానికి రికార్డు స్థాయిలో వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ఇప్పటికే అక్కడ 201 టీఎంసీల నీరు చేరాయి. ఇంకా ఇన్‌ఫ్లో లక్షన్నర క్యూసెక్కులకు పైగానే వస్తోంది. సాధారణంగా శ్రీశైలం నీటి మట్టం 854 అడుగులు దాటితే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి సోమశిలకు తరలించేందుకు వీలుంది. ప్రస్తుతం శ్రీశైలం నీటిమట్టం 882 అడుగులు దాటింది. పదిరోజుల క్రితమే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి సోమశిలకు నీటి విడుదల ప్రారంభించారు. అయితే ఆశించినంత ఎక్కువ నీటిని సోమశిలకు మళ్లించడంలేదు. సోమశిల, కండలేరు రిజర్వాయర్లలో ఉన్న నీరు ప్రస్తుత పంట సాగుకు సరిపోతుంది. వచ్చే నెలాఖరుకు ఈ రెండు జలాశయాలు ఖాళీ అవుతాయి. అయితే ఇప్పటి నుంచే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా వీలైనంత ఎక్కువగా కృష్ణా జలాలను సోమశిల, కండలేరులకు తరలిస్తే భవిష్యత్‌పై ఆందోళన చెందాల్సిన అవసరముండదు. ప్రస్తుతం రెండు జలాశయాల్లో 90 టీఎంసీల వరకూ నీటి నిల్వ ఖాళీ ఉంది. గతేడాది కూడా ఇదే పరిస్థితులు ఉండగా, అప్పుడు ముందుచూపుతో ఆలోచించిన ప్రభుత్వం.. 60 టీఎంసీలకు పైగా కృష్ణా జలాలను సోమశిల, కండలేరులకు తరలించింది. ఇప్పుడు కూడా ఈ జలాశయాలను నింపాలని రైతులు కోరుతున్నారు.

- కృష్ణా, గోదావరిల్లో పుష్కలంగా నీరు
- ఆశించిన స్థాయిలో జిల్లాకు రాని కృష్ణాజలాలు
- రోజుకు 3,300 క్యూసెక్కులతోనే సరి!
- 10 వేల క్యూసెక్కులు వస్తేనే ప్రయోజనం
- రెండు జలాశయాల్లో 90 టీఎంసీల ఖాళీ
- లోటు వర్షపాతంతో రైతుల్లో ఆందోళన
- పట్టీపట్టనట్లుగా ప్రజాప్రతినిధులు

● జిల్లాలో లోటు వర్షపాతం

ఈ ఏడాది జిల్లాలో ఆశించినంతగా వర్షాలు కురవలేదు. సాధారణంగా నైరుతి రుతుపవనాల ప్రభావంతో జూన్, జూలై నెలల్లో ఓ మోస్తరు వర్షాలు కురస్తుంటాయి. ఆ వర్షాలు రెండో పంటకు ఎంతగానో ఉపయోగపడతాయి. కానీ ఆ పరిస్థితి లేకపోవడంతో జలాశయాల్లోని నీటినే సాగుకు వాడాల్సి వస్తోంది. జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం 95 మి.మీగా నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకూ 50 మి.మీ మాత్రమే కురిసింది. అంటే దాదాపు సగం వర్షపాతం లోటు ఉందన్నమాట.

● పట్టించుకోకపోతే ఎలా..?

ప్రస్తుతం సోమశిల, కండలేరు జలాశయాల్లో ఉన్న నీరు జరుగుతున్న పంట సాగుకే సరిపోతుంది. ఈ సాగుకు పోను డెడ్ స్టోరేజీ మిగులుతుంది. ఇక వర్షాలు కురిస్తేనే రబీలో సాగు చేసుకోవాలి. దీంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. అయినా జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఒక్క జిల్లా స్థాయి సమావేశం కూడా నిర్వహించలేదు. ఈనెల 17న డీఆర్సీ నిర్వహించాలని భావించినా అది కూడా జరగలేదు. ప్రస్తుతం కృష్ణా జలాలను తీసుకొచ్చేందుకు ప్రజాప్రతినిధులంతా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

రిజర్వాయర్లలో నీటి నిల్వ వివరాలు

ప్రాజెక్టు పేరు	పూర్తి నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఖాళీ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కులు)
శ్రీశైలం	215.81	201.58	14.23	1,56,516	89,338
సోమశిల	78	27.65	50.36	3347	5166
కండలేరు	68.03	28.81	39.23	0	2900



శాకంబరిగా కొలువుదీరిన కామాక్షితాయి

శాకంబరిగా కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం,జూలై20(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం కామాక్షితాయి అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా నలు మూలల నుంచి తరలి వచ్చిన ముత్తైదువలు, సమరసత సేవా ట్రస్టు సభ్యులు కామాక్షితాయికి సారె సమర్పించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు కూడా అమ్మవారికి సారె సమర్పించారు. వారికి ఆలయ సేవా కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి దంపతులు, సభ్యులు,ఈవో ఏవీ. శ్రీనివాసులురెడ్డి, తదితరులు ఘనస్వాగతం పలికారు. వేమిరెడ్డి దంపతుల వెంట కమిటీ సభ్యులు, నందకుమార్, సుధాకర్, శ్రీనివాసులు, స్థానిక టీడీపీ నాయకులు ఉమ్మయ్యస్వామి, రత్నం, నరసింహ, బుచ్చి చైర్‌పర్సన్ సుప్రజ, వైస్ చైర్మన్ శివకుమార్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు ఉన్నారు.


బిల్లులు వస్తేనే.. ఇళ్లు !

- అర్థంతరంగా ఆగిన నిర్మాణాలు
- అసంపూర్తిగా 29 వేల గృహాలు
- చేసిన పనులకు డబ్బుల కోసం కాంట్రాక్టర్ల నిరీక్షణ

నెల్లూరు (జడ్పీ), జూలై 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేదల పక్కాగృహాలకు పట్టిన గ్రహణం వీడలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్భాటాలకే పరిమితమైన నిర్మాణాలపై ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినా, నిర్మాణాలు వేగవంతం కాలేదు. గత ప్రభుత్వంలో ఆప్షన్-3ద్వారా కాంట్రాక్టర్లతో ఇళ్లనిర్మాణాలు చేపట్టారు. ఇందులో కొన్ని నిర్మాణాలు పూర్తి చేసి, బిల్లులు అధికంగా వసూలు చేసుకుని అక్రమాలకు పాల్పడ్డారు. అయితే ప్రభుత్వం మారడంతో పక్కా ఇళ్ల నిర్మాణాల్లో మళ్లీ కదలిక వచ్చింది. గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి జిల్లాకు వచ్చి, గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణాలన్నింటినీ పూర్తిచేసి, పేదలకు సొంతింటి కలను నెరవేర్చాలని ఆదేశించారు. అలాగే వచ్చే ఏడాది మార్చి నాటికి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లు కట్టిన నిర్మాణాలన్నింటినీ పరిశీలించి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, ఈ క్రమంలో ఆ నిర్మాణాలను అదే కాంట్రాక్టర్‌తో పూర్తిచేయించాలని, లేని పక్షంలో ఇతరులకు అప్పగించి పూర్తిచేయాలని కూడా అధికారులను ఆదేశించారు.

● కాంట్రాక్టర్ల చేతిలో 29వేల ఇళ్లు

జిల్లావ్యాప్తంగా కాంట్రాక్టర్లు కట్టే ఇళ్లు 29వేలు ఉండగా, వాటిలో కేవలం 6వేల గృహాలు మాత్రమే కొంతమేరకు పూర్తిచేశారు. మిగతా గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటికి సంబంధించి జరిగిన పనులకు దాదాపుగా రూ.3.5కోట్ల బిల్లులను కాంట్రాక్టర్లకు మంజూరు చేయాల్సి ఉంది. ఆ బిల్లులు మంజూరైతేనే మిగతా పనులను కాంట్రాక్టర్లు పూర్తిచేసే అవకాశం ఉంది. వచ్చే ఏడాది మార్చికల్లా పక్కాగృహాల నిర్మాణాలను పూర్తిచేయాలన్న లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం బిల్లుల మంజూరుకు సుముఖత వ్యక్తం చేసింది. అయితే గృహనిర్మాణశాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల నుంచి స్పందన తక్కువగా ఉండడంతో బిల్లుల మంజూరుకు ఆటంకాలు ఏర్పడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై జిల్లా మంత్రులు, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పాత బిల్లులు మంజూరు చేయిస్తేతప్ప పక్కా ఇళ్ల నిర్మాణంలో కదలిక వచ్చే అవకాశం లేదు.



పొదలకూరులో అసంపూర్తిగా ఉన్న ఇళ్లనిర్మాణాలు

'గిట్టుబాటే' సమస్య

గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కుతున్న పొగాకు రైతులు.... పెట్టుబడిలో సగం కూడా కళ్లజూడలేమన్న ఆందోళనలో మిర్చి రైతులు.. రోజూ వింటూనే ఉన్నాం... చూస్తూనే ఉన్నాం. అయితే వీరికన్నా దారుణమైన పరిస్థితి పప్పుదినుసులు, అపరాలు సాగుచేసిన రైతులది. శనగలు, మినుములు, పెసలు, కందులు... ఇలా ఏ పంట చూసుకున్నా గిట్టుబాటు ధర లేక, ఉన్న ధరలకు తెగనమ్ముకోలేక రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు.

- ఏ పంటకూ ధర రాక రైతుల అయోమయం
- శీతల గిడ్డంగుల్లో మగ్గుతున్న పప్పుదినుసులు, అపరాలు
- కేంద్రం నిర్ణయంతో సగానికి పడిపోయిన రేట్లు



కందుకూరు సమీపంలోని శీతల గిడ్డంగిలో నిల్వ ఉన్న శనగల బస్తాలు

కందుకూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): గత ఏడాది మార్కెట్ ధరలతో పోలిస్తే అన్నిరకాల పప్పు దినుసులు, నూనెగింజల ధరలు సగానికి సగం తగ్గాయి. గత రబీ సీజన్‌లో పంటలు సాగు చేసే సమయానికి ఉన్న ధరలు, చేతికొచ్చే సమయానికి లేవు. దీంతో ధరలు పెరిగాక అమ్ముకోవచ్చని రైతలు శీతల గిడ్డంగుల్లో దిగుబడులను నిల్వచేశారు.ఈ ఏడాది మార్చిలో దిగుబడి అయిన పంట ఉత్పత్తులను కూడా గిట్టుబాటు ధరపై ఆశతో నిల్వ చేసిన రైతులు దిక్కుతోచని స్థితిని అనుభవిస్తు న్నారు. ఒకవైపు కోల్డ్ స్టోరేజీల అద్దెలు... మరోవైపు రెండేళ్లుగా పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులపై పెరుగుతున్న వడ్డీలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

● సగానికి సగం తగ్గిన ధరలు

పప్పు శనగల ధర 2024 మార్చికి ముందు క్వింటాల్ కాగ్ 2 రకం రూ. 12,500 వరకు పలకగా, మే నాటికి క్వింటాల్ రూ. 7వేలకు పడిపోయింది. ప్రస్తుతం క్వింటాల్ రూ. 6200 మాత్రమే ఉంది. అలాగే దేశీరకం శనగలు కూడా అప్పట్లో క్వింటాల్ రూ. 9వేల వరకు పలకగా, ప్రస్తుతం నాణ్యతను బట్టి క్వింటాల్ రూ. 4500 నుంచి రూ. 5500 ధర మాత్రమే పలుకుతోంది. అలాగే మినుములు 2024 మార్చికి ముందు వరకు క్వింటాల్ రూ. 10వేలకు తక్కువ కాకుండా సరుకు నాణ్యత బాగుంటే రూ. 11వేలు వరకు కొనుగోలు చేశారు. అవే మినుములు ప్రస్తుతం క్వింటాల్ రూ. 5వేలు నుంచి 6వేలు ధర పలుకుతోంది. కందులు, పెసర్లు కూడా రెండేళ్లనాటి ధరతో పోలిస్తే క్వింటాల్ కు రూ. 5వేలు వరకు ధర పతనమైంది. ఇక నువ్వులు, పొద్దుతిరుగుడు లాంటి నూనె గింజలకూ గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కందుకూరు ప్రాంతంలో వేలాది ఎకరాల్లో శనగ, మినుము సాగుచేస్తారు. కాబట్టి 2లక్షల క్వింటాళ్ల శనగలు, 60వేల క్వింటాళ్ల మినుములు శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంటాయని అంచనా వేస్తున్నారు. కందుకూరు ప్రాంతంలోని శీతల గిడ్డంగుల్లో పట్టిక సింగరాయకొండ, టంగుటూరు, కొండపి, ఒంగోలు లాంటి ప్రాంతాల్లో కూడా ఇక్కడి రైతులు తమ పంట ఉత్పత్తులను నిల్వ చేశారు.



మినుములు

కేంద్రం నిర్ణయాలే కారణం

కేంద్ర ప్రభుత్వం దేశంలో పప్పుధాన్యాల కొరతను తీర్చాలన్న లక్ష్యంతో ఓవైపు పప్పుదినుసుల అభివృద్ధి పథకం పేరుతో అనేకరకాలుగా ప్రోత్సాహకాలు అందిస్తూ , మరోవైపు ఇబ్బడి ముబ్బడిగా విదేశాల నుంచి దిగుమతులకు అనుమతులు ఇవ్వటమే ఈ దుస్థితికి కారణమని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా, బ్రెజిల్ లాంటి దేశాలు, మరికొన్ని ఆసియా దేశాల నుంచి పెద్దఎత్తున శనగలు, మినుములు, కందులు దిగుమతి అవుతుండటంతో దేశీయంగా ధరలు పతనమయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వంపై ఒత్తిడితెస్తే తప్ప ధరల పతనం నుంచి బయట పడలేమని రైతులు పేర్కొన్నారు.

నేడు అంగన్‌వాడీల ఆందోళన

- కనీస వేతనం కోసం, యాప్‌ల రద్దు కోరుతూ...
- సీడీపీవో కార్యాలయాల వద్ద ధర్నా



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు(ఫైల్)

నెల్లూరు (హరనాథపురం), జూలై 20 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు ఆందోళనబాట పట్టారు. సోమవారం జిల్లాలోని అన్నీ సీడీపీవోల కార్యాలయాల వద్ద ధర్నా చేయనున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా, చాలీచాలనీ జీతంలో జీవనాన్ని సాగిస్తున్నామని వారు వాపోయారు. అంతేకాక వివిధ యాప్‌లతో పనిభారం పెరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ప్రధాన డిమాండ్లు ఇవే...

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్‌లను రద్దు చేయాలి.
- కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి.
- పెన్షన్, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి.
- వేతనాలు, అలవెన్సులు, అద్దెలు, మొబైల్ ఫోన్లు, రీచార్జిలకు సంబంధించిన బకాయిలన్నీ వెంటనే చెల్లించాలి.

పోరు ఉధృతం చేస్తాం..



అంగన్‌వాడీలు ఏళ్ల తరబడి చిన్నారులు, గర్భిణులు, బాలింతల సేవలో ఉన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న క్రమంలో చాలీచాలనీ వేతనాలతో జీవనం గడపలేక పోతున్నారు. కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన యాప్‌లను రద్దు చేసి, పనిభారం తగ్గించాలి. సమస్యలు పరిష్కరించకపోతే పోరుబాటను ఉధృతం చేస్తాం.

- ఏలూరు సుజాతమ్మ, జిల్లా అధ్యక్షురాలు
అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

సమన్వయంతోనే ప్రజలకు సత్వర న్యాయం



పోలీసు అధికారులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

నెల్లూరు(క్రైం), జూలై 20(ఆంధ్రజ్యోతి): న్యాయ వ్యవస్థ, పోలీసుశాఖల సమన్వయంతోనే ప్రజలకు సత్వర న్యాయం జరుగుతుందని జిల్లా న్యాయాధికారి జీ. శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ జీ. కృష్ణకాంత్ అర్థ వార్షిక నేరసమీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా న్యాయాధికారి మాట్లాడుతూ పోలీసులు సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించి, ప్రజాజీవనంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని అన్నారు. కొత్త చట్టాలు అమలులో ఉన్నందున వాటిపై క్షుణ్ణంగా అవగాహన పొందాలని తెలిపారు. అనంతరం ఎస్పీ జిల్లాలో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలు, ఇతర కేసుల నమోదు, ఛేదన గురించి సర్కిళ్ల వారీగా సమీక్ష నిర్వహించి, సీడీ ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలతో మమేకమై వారితో స్నేహంగా, సహాయకారిగా మెలిగినప్పుడే పోలీసుల పట్ల సదాభిప్రాయం ఏర్పడి విశ్వాసం పెరుగుతుందన్నారు. ఫాస్ట్ ట్రాక్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. గంజాయి, మట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణా, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయాలని, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ ఆదేశించారు. సైబర్‌నేరాలు, మాదక ద్రవ్యాలతో అనర్థాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, పీపీలు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు ఎక్కడ? 8 లో..

జంతుబలిపై వివాదం

- భారీ బందోబస్తు మధ్య గంగమ్మకు పొంగళ్లు

లింగసముద్రం, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపాలెం సమీపంలోని పొలాల్లో వెలసి ఉన్న గ్రామదేవత గంగమ్మకు ఆదివారం నిర్వహించాల్సిన పొంగళ్లు, జంతుబలి విషయమై తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెం గ్రామాల మధ్య వివాదం నెలకొంది. అలాగే తిమ్మా రెడ్డిపాలెం గ్రామస్థులు కొత్తగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో పురాతన గంగమ్మ ఆలయంలోని విగ్రహా లను ప్రతిష్ఠ చేసే విషయమై కూడా వివాదాస్పదమైంది. దీంతో రెండు గ్రామాల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న గుడ్లూరు సీఐ మంగారావు ఆధ్వర్యంలో ఎస్సైలు ఎం నారాయణ, వెంకట్రావులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గంగపాలెం వాసులు గంగమ్మ ఆలయం వద్ద పొంగళ్లు నిర్వహించి, జంతుబలి ఇస్తారని తెలుసుకున్న తిమ్మారెడ్డిపాలెం యువకులు, మహిళలు అడ్డుకునేందుకు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. దీంతో తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి, సీఐ మంగారావుల తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెం గ్రామపెద్దలను పిలిపించి చర్చించారు. ఈ సందర్భంగా గంగపాలెం గ్రామ పెద్దలు మాట్లాడుతూ పురాతన గంగమ్మ ఆలయం రెండు గ్రామాలకు చెందిందని, ఇందులోని విగ్రహాలను తిమ్మారెడ్డిపాలెం గ్రామస్థులు ఈ ఆలయ సమీపంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠ చేయాలని చూస్తున్నారని, దీన్ని ఒప్పుకోబోమన్నారు. అయితే గంగపాలెం గ్రామస్థులు పొంగళ్లు నిర్వహించుకోవచ్చని, కానీ జంతుబలి ఇవ్వకూడదని తెలిపారు. ఎందుకంటే ఆగస్టు ఒకటిన నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉందని, అంతవరకు ఆలయ సమీపంలో జంతుబలి ఇవ్వకూడదని తేల్చి చెప్పారు.



గంగమ్మ ఆలయం వద్ద ఇరువర్గాల గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న తహసీల్దార్ సీతామహాలక్ష్మి, సీఐ మంగారావు

● జంతుబలి ఇస్తే చర్యలు

అధికారులు చొరవ తీసుకొని గంగపాలెం గ్రామస్థులు పొంగళ్లు మాత్రమే పెట్టుకోవాలన్నారు. తిమ్మారెడ్డిపాలెం గ్రామస్థులు కూడా ఆగస్టు 1న నూతన ఆలయంలో పొంగళ్లు నిర్వహించుకోవచ్చని, కానీ పాత ఆలయంలోని విగ్రహాలను మార్చకూడదన్నారు.ఇరువర్గాల వారు జంతుబలి ఇవ్వరాదని తహసీల్దార్ చెప్పారు. ఇందుకు రెండు గ్రామాల పెద్దలు అంగీకరించారు. కాగా సాయంత్రం 4 గంటల సమయంలో గంగపాలెం గ్రామస్థులు మేళతాళాలతో పెద్దఎత్తున తరలి వచ్చి గంగమ్మకు పొంగళ్లు నిర్వహించారు. అలాగే పోతురాజు విగ్రహానికి 101 బిందెల జలాలతో అభిషేకం చేశారు. తిమ్మారెడ్డిపాలెం మహిళలు, యువకులు పోలీసులతో వాగ్వివాదానికి దిగగా, పోలీసులు వారిని దూరంగా తరిమి వేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో డీ మస్తాన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	131
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	258

కోడిగుడ్ల ధర (100) : 520

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9445
వెండి కిలో ధర	రూ. 115800
వెండి ఒక గ్రాము	రూ.118.80

గ్రంథాలయ నిర్మాణానికి సహకరించండి

నెల్లూరు(హరనాథపురం), జూలై 20(ఆంధ్రజ్యోతి) : నగరంలోని జామావా గ్రంథాలయ భవన నిర్మాణ పూర్తికి సహకరించాలని ఆ గ్రంథాలయ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ ఖాసీం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కోరారు. ఆయన ఆదివారం ఎంపీని, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని వారి కార్యాలయాల్లో కలిశారు. ఈ కార్యక్రమంలో కుసుమకుమారి, ఏవీ సుబ్బారావు, నారాయణ, కొమ్మల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అవార్డులిచ్చిన కార్మికులకు ఒక్క రూపాయీ ఇవ్వలేదు!

● జీతాలు పెంచాలి ● మానవహారంతో మున్సిపల్ కార్మికుల నిరసన

నెల్లూరు (వైద్యం), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రావడానికి కారణమైన మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ప్రోత్సాహకం ఇవ్వలేదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు ఆరోపించారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిప ల్ కార్మికులు ఆదివారం నగరంలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. స్వతంత్ర పార్క్ నుంచి ప్రదర్శనగా బయలుదేరి గాంధీబొమ్మ చుట్టూ మానవహారంగా ఏర్పడ్డారు. శ్రీనివాసులు మాట్లాడు తూ కేంద్రం అవార్డులు వచ్చినందుకు ఒకవైపు కార్మికులకు శాలువాలు కప్పుతూ మరోవైపు అదే కార్మికుల పొట్టగొట్టేలా పారిశుధ్య పనులను కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారని విమర్శించారు. ఇంజనీరింగ్ కార్మికుల వేతనాల పెంపు కోసం గత ప్రభుత్వంలోనే జీవోలు ఉన్నాయని, వాటి అమలుకు సమ్మె చేయాల్సి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండా ప్రసాద్, సుధాకర్, యూనియన్ నాయకులు సునీల్ కుమార్, తాళ్లూరి రమేష్, షబ్బీర్, మరియన్న, లోకేష్, శ్రీనివాసులు, రాంబాబు, మాలకొండయ్య, కామాక్షమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



గాంధీబొమ్మ సెంటర్‌లో మానవహారంగా మున్సిపల్ కార్మికులు

విద్యతోనే ఉన్నత స్థానం

● గాండ్ల తెలికుల ప్రతిభా పురస్కారాల్లో ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానం దక్కుతుందని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నగరంలోని మహేశ్వరి, పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం గాండ్ల, తెలికుల కుల విద్యార్థులకు ప్రతిభా పురస్కార ప్రదానోత్సవం జరిగింది. అఖిల గాండ్ల, తెలికుల కులస్తుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తల్లిదండ్రులు వారి పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. గాండ్ల తెలికుల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎంఎస్ఎంఈ పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గిద్దలూరు ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి తిరుపతి హరగోపాల్, మాడిశెట్టి గురునాథం, చాకిరాల శేషయ్య, వరికుంట్ల సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందచేస్తున్న ఎంపీ వేమిరెడ్డి

వైద్య, రక్తదాన శిబిరం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రంగనాయకుల పేట ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఆదివారం వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. నారాయణ వైద్య కళాశాల, రెడ్‌క్రాస్ రక్తనిధి సహకారంతో ఈ శిబిరాలు ఏర్పాటు చేశారు. జీఎస్‌టీ అధికారి ఎం సత్యప్రకాష్, అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు, కార్యదర్శి ఫణీంద్రకుమార్, కోశాధికారి బోగనాధం సుబ్రహ్మణ్యం, ప్రోగ్రామ్ ఛైర్మన్ జాలాది చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

యానాదుల అక్షరాస్యత గోడపత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(హరనాథపురం), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులను అక్షరాస్యులుగా మార్చడానికి ఉద్దేశించిన ప్రచార గోడపత్రికలను ఆదివారం నగరంలోని జయభారత్ ఆసుపత్రి సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. యానాదుల హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో గిరిజన కాలనీల్లో అక్షరాస్యతా శాతం పెంచుతామని చెప్పారు. ఈఈగా ఉదోగోన్నతి పొందిన తలపల రమేష్, జిల్లా డెవలప్‌మెంట్ కో ఆర్డినేషన్, మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమితులైన ప్రసాద్, పోట్లూరి శ్రీనివాసులును ట్రస్టు తరపున యాకసిరి శ్రీనివాసులు సత్కరించారు.

ఉత్సాహంగా ఆలిండియా చెస్ పోటీలు

నెల్లూరు(విద్య), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ చెస్ డే సందర్భంగా ఏపీ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ, ఎంజీబీ మాల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మాల్‌లో ఆలిండియా చెస్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మాల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ మల్లికార్జున రెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. పలు రాష్ట్రాల నుంచి ఫిడే రేటింగ్ క్రీడాకారులు, టైటిల్ ప్లేయర్స్, ఫిడే మాస్టర్స్ పాల్గొని ప్రతిభచూపారు. ఈ పోటీలు రెండురోజులు జరుగుతాయని రాష్ట్ర చెస్ సంఘం కార్యదర్శి వై సుమన్ తెలిపారు.

యశస్వినికి రెండు పతకాలు



నెల్లూరు (సాంస్కృతికం), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులో శని, ఆదివారాల్లో జరిగిన 6వ దక్షిణ భారత పెన్‌కాక్ సిలాట్ చాంపియన్‌షిప్ -2025 పోటీల్లో నగరానికి చెందిన పొనుగోటి యశస్విని రెండు రజిత పతకాలు సాధించింది. ఆమెను పలువురు అభినందించారు.

రంగడి ఆలయంలో నిత్యాన్నదానానికి రూ.50,116 విరాళం



నెల్లూరు (సాంస్కృతికం), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో ప్రారంభంకానున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం దాతలు రూ.50,116 విరాళం అందజేశారు. నగరంలోని గోమతీనగర్‌కు చెందిన కే రాజశేఖర్‌రెడ్డి, పద్మజ దంపతులు ఈ విరాళాన్ని ఆలయ ఈవో ఏ శ్రీనివాసరెడ్డికి అందజేశారు.

ఆకట్టుకున్న 'బుద్ధుడితో నా ప్రయాణం'

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వేంకటేశ్వర కస్తూరిబా కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి భారతీయ అంబేడ్కర్ సేవ, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ సంయుక్తంగా ప్రదర్శించిన బుద్ధునితో నా ప్రయాణం నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. గౌతమ బుద్ధుని జీవితం, అంబేడ్కర్ బుద్ధునిపై, బౌద్ధమతం గురించి రాసిన రచనల ఆధారంగా ఈ నాటకాన్ని ప్రదర్శించారు. బౌద్ధమతం విశ్వవ్యాపితం అయ్యేందుకు బలీయ మైన శక్తి ఏమిటో ప్రేక్షకులను ఆలోచింపచేసే విధంగా ఈ నాటకాన్ని నవరసరభరితంగా ప్రదర్శించారు. 22 మంది కళాకారులు తమ పాత్రల్లో రాణించారు. బుద్ధుడిగా ఆనంద్, అంబేడ్కర్‌గా గోపి, సిద్ధార్థుడిగా అఖిల్, రాహులుడిగా సాయి, బుద్ధుని తండ్రి పాత్రలో కొండలరావు జీవించారు. ఈ నాటకం రచన కే దేవేందర్ (ఖమ్మం), దర్శకత్వం శివప్రసాద్ తూము, సంగీతం కృష్ణమోహన్, నృత్య సహకారం అజయ్ అందించారు.

ఉర్రూతలూగించిన 'యాదేరఫీ'



యాదేరఫీ సంగీత విభావరిలో గాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నా మదినిన్ను పిలిచింది గానమై.. నా ప్రాణమై... ఎంతవారు గానీ వేదాంతులైనాగానీ.. వాలుచూపు సోకగానే తేలిపోదురోయ్.. కైపులో... అంటూ అలనాటి మధుర గాయకుడు మహమ్మద్ రఫీ ఆలపించిన గీతాలతో పురమందిరం హోరెత్తింది. మహమ్మద్ రఫీ 45వ వర్ధంతి సందర్భంగా యాదేరఫీ మ్యూజికల్ నైట్ ఆదివారం రాత్రి జరిగింది. ముందుగా రఫీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వివిధ భాషల్లో రఫీ పాడిన పాటలను మహమ్మద్ రఫీ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు జావిద్ అహమ్మద్ ఆధ్వర్యంలో గాయకులు ఆలపించి శ్రోతలను ఉర్రూతలూగించారు.తత ఈ కార్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు సహకరించారు. సయ్యద్‌సమీ, ఆసిఫ్ పాషా, జాఫర్ షరీఫ్, కార్పొరేటర్ కరిముల్లా సాహెబ్, మురళీకృష్ణ, బలరామయ్య నాయుడు, షేక్ రియాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో 25 నుంచి శ్రావణమాస వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 25 నుంచి శ్రావణమాస వేడుకలు జరగనున్నాయి. దీనికి సంబంధించి కరపత్రాలను ఆదివారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆయన కార్యాలయంలో ఆవిష్కరిం చారు. ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, అర్చకులు, వేద పండితులు ఎమ్మెల్యేను శ్రావణమాస ఉత్సవాలకు ఆహ్వానించారు. అనంత రం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ శ్రావణమాసంలో ప్రతీ మంగళవారం కాత్యాయనీ వ్రతం, పూలంగిసేవ, పల్లకీసేవ, ప్రతీ శుక్రవారం లక్ష కుంకుమార్చన జరుగుతాయని తెలిపారు. మూడో శుక్రవారం ఆగస్టు 8న వరలక్ష్మీ వ్రతం, చివరి శుక్రవారం ఆగస్టు 22న ధాన్యం (వడ్లు)తో అమ్మవారికి విశేష అలంకారం జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

పీఎన్ఎం మున్సిపల్ కళాశాలలో ఫ్రెషర్స్ డే

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జెండావీధిలో ఉన్న పీఎన్ఎం మున్సిపల్ మహిళా జూనియర్ కళాశాలలో ఆదివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఏపీ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్, నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గతేడాది అత్యధిక మార్కులు సంపాదించిన విద్యార్థినులను సత్కరించారు. అజీజ్ మాట్లాడుతూ ఆడపిల్లలకు ఉన్నత విద్యనందించాలన్న ఆలోచనతో కాలేజీని స్థాపించామని, విద్యార్థినుల సంఖ్య 150 నుంచి 1500 పెరిగేలా బోధన, ఫలితాలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాఫర్ షరీఫ్, ఇంతియాజ్, నౌషాద్, జాఫర్, జమీర్, రబ్బానీ, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న అజీజ్

సమాజాన్ని మార్చే శక్తి సాహిత్యానిది

● ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సమాజాన్ని మార్చే శక్తి సాహిత్యానికి, రచయితలకు మాత్రమే ఉందని ఎమ్మెల్యే, తెలుగుభాష ఉద్యమకారుడు మండల బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం టౌన్‌హాల్‌లో విశాలాక్షి మాసపత్రిక 16వ వార్షికోత్సవ సభ జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సాహిత్యం బతకాలంటే విద్యా విధానంలో మార్పు రావాలన్నారు. ప్రభుత్వ విధానాలు తెలుగు భాషకి ఎంత అనుకూలమైనా అవి ప్రభుత్వ పాఠశాలల్లోనే అమలవుతాయని చెప్పారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు తెలుగు భాష, సాహిత్యానికి అడ్డుకట్టగా నిలవడం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆక్వా అథారిటీ బోర్డు ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషను కాపాడుకోవాలని, ఇందుకోసం తల్లిదండ్రుల నుంచి ఒక ఉద్యమ స్థాయిలో కదలిక రావాలని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా విశాలాక్షి విరిజల్లులు కార్టూన్ సంకలనాన్ని ఆవిష్కరించారు. మామిడిపూడి రామకృష్ణయ్య స్మాల్ గంగా నిర్వహించిన కార్టూన్ల పోటీలో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కథా - కవిత - మినీ కథల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులిచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అమరావతి కృష్ణారెడ్డి, గ్రంథకర్త జీవీ పూర్ణచంద్, సామాజిక పర్యావరణవేత్త కుసుమకుమారి, ప్రముఖ కథకులు పీవీఆర్ శివకుమార్, పబ్లిషర్ కోసూరు రత్నం, సంపాదకుడు ఈతకోట సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



కార్టూన్ సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న బుద్ధ ప్రసాద్, ఏవీఆర్ తదితరులు

దేవాంగ వివాహ పరిచయ కార్యక్రమం

నెల్లూరు(హరనాథపురం), జూలై 20(ఆంధ్రజ్యోతి) : దేవాంగ వధూవరుల వివాహ పరిచయ కార్యక్రమం జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని హెచ్ఆర్ కల్యాణ మండపంలో జరిగింది. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మన్నెం సతీష్, ఏపీ దేవాంగ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బీ సురేంద్ర, కోశాధికారి పరమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నెమలి వాహనంపై సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



నెమలి వాహనంపై ఊరేగుతున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో ఆదివారం ఆడికృత్తిక సందర్భంగా వళ్ళీ, దేవ సేన సమేతంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గ్రామోత్సవంలో నెమలివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉభయదాత చిట్టమూరు వెంకటరెడ్డి దంపతులు ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పంచామృతాభిషేకం, ఆడికృత్తిక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఏవీ. శ్రీనివాసులురెడ్డి కార్యక్ర మాలను పర్యవేక్షించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కోవూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం 9వ జిల్లా మహాసభల్లో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందించినా ఆచరణలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాడి సంక్షేమ పథకాలను సాధించుకోవాలన్నారు. కార్మిక సంఘం నాయకులు కటారి అజయ్‌కుమార్, హరి, సూరిబాబు, సంపూర్ణమ్మ, గండవరపు శేషయ్య తదితరులు పాల్గొన్నారు. భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా అల్లాడి గోపాల్, కే శ్రీనివాసులు ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న నరసింగరావు

కంటి వైద్య సేవలు అందేనా?

● ముగిసిన అపోలో కాంట్రాక్ట్ గడువు ● అద్దాల కోసం పేదల ఎదురుచూపులు

పొదలకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రంలోని కంటి విభాగం తలుపులు తెరుచుకోవడం లేదు. పది నెలలుగా ఆప్తమాలజిస్ట్ ఇక్కడికి రావడం లేదు. రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా అద్దాలు అందజేసేందుకు గత ప్రభుత్వంలో అపోలో హాస్పిటల్‌కు కాంట్రాక్ట్ అప్పగించారు. ప్రస్తుతం కాంట్రాక్ట్ గడువు ముగియడంతో సీహెచ్‌సీలోని కంటి విభాగాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ఫలితంగా నిత్యం వైద్య పరీక్షలు, అద్దాల కోసం వచ్చేవారు ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు ఇక్కడ కంటి పరీక్షలు చేయించుకుని ఉచితంగా అద్దాలు పొందేవారు. చేజర్ల, కలువాయి, సైదాపురం మండలాల నుంచి కూడా సీహెచ్‌సీకి వచ్చేవారు. కంటి విభాగం తలుపులు తెరుచుకుని పేదలకు వైద్యం అందాలంటే ప్రభుత్వం టెండర్లను నిర్వహించాల్సి ఉంది. ఇప్పటివరకు అపోలో ఆస్పత్రి యాజమాన్యం టెండర్ల కాంట్రాక్టు దక్కించుకుని అద్దాలు అందజేసింది. ప్రస్తుత ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించి తిరిగి ఆ విభాగాన్ని పునరుద్ధరించాల్సి ఉంది. ఇందుకు ఎంత సమయం పడుతుందో తెలియదని అధికారులు అంటున్నారు. ఈలోగా అద్దాలు అవసరమైన వారు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ఈ విషయమై సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యు. ప్రసాద్‌ను వివరణ కోరగా అపోలో ఆస్పత్రి కాంట్రాక్ట్ పూర్తి కావడంతో అద్దాల పంపిణీ నిలిచిపోయిందన్నారు. తిరిగి టెండర్లు నిర్వహించి థర్డ్ పార్టీకి అప్పగిస్తే పరీక్షలు నిర్వహించి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తామన్నారు.



పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. మండలంలోని గంగపట్నం, రాముడు పాలెం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రజల సమస్యలను ఓపిక గా విన్నారు. రాముడుపాలెం ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానిక సర్పంచ్, అధికారులను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. గతంలో స్థానిక నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి గిరిజనులకు 450 ఆధార్ కార్డులు ఇప్పించిన విషయాన్ని ప్రస్తావించారు. స్థానిక నాయకులు, అధికారులు ఆధార్, రేషన్ కార్డులు లేని వారికి వెంటనే వాటిని మంజూరు చేయించి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వీరేంద్రనాయుడు, టీడీపీ మండలాధ్యక్షులు ఏకొల్లు పవన్‌కుమార్ రెడ్డి, పొన్నెబోయిన చెంచు కిషోర్‌యాదవ్, కోడూరు కమలాకర్ రెడ్డి, అవ్వారు ఏడుకొండలు, బండ్ల మల్లికార్జున, ఉదయ్‌కుమార్, దొడ్ల మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తాం

● సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మనుబోలు, జూలై 20(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యలన్నింటినీ ఎమ్మెల్యే సోమిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. మండలంలోని చెర్లోపల్లిలో ఆదివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు అందించి ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి పనులను ఆయన ప్రజలకు వివరించారు. ఇళ్లు దెబ్బతిన్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, కొత్త ఇళ్లు కట్టించి ఇవ్వాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి మధునాయుడు, కేసీపీసీ ఛైర్మన్ మస్తాన్ నాయుడు, టీడీపీ నాయకులు కలికి వేణుగోపాల్‌రెడ్డి, పొన్నూరు అశోక్, సుమన్‌తేజ, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలి సమస్య వింటున్నరాజగోపాల్ రెడ్డి

నిత్యాన్నదాన పథకానికి విరాళం

రాపూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఆదివారం చిత్తూరు వాస్తవ్యులు సురభి నరసింహమూర్తి, అనూరాధలు రూ. 25 వేల చెక్కును విరాళంగా కార్యాలయ సిబ్బందికి అందజేశారు. తల్లిదండ్రులు సురభి సుబ్రహ్మణ్యం, అనంత లక్ష్మీ జ్ఞాపకార్థం విరాళం ఇచ్చారు. నిర్వాహకులు దాతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదం అందజేశారు.



చెక్కు అందజేస్తున్న నరసింహమూర్తి దంపతులు

పొంగళ్లోయ్.. పొంగళ్లు.. మనుబోలమ్మకు పొంగళ్లు!

మనుబోలు, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆషాడమాసంలో గ్రామదేవతలకు పూజలు చేస్తే గ్రామంలో అంతా సుభిక్షంగా ఉండి, వర్షాలు కురిసి పంటలు పండి, అందరూ ఆయురారోగ్యాలతో ఉంటారన్న నమ్మకంతో మండలకేంద్రమైన మనుబోలులో గతరెండు ఆదివారాలుగా గ్రామదేవత మనుబోలమ్మకు సలిపిండి, పానకాలు పోశారు. ఆషాడమాసం చివరి ఆదివారం కావడంతో గ్రామస్తులంతా ఏకమై మనుబోలమ్మకు పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. గ్రామదేవత ఆలయం పక్కనే ఉన్న నాగార్పమ్మ, గంగమ్మలకు అభిషేకాలు నిర్వహించారు. ముగ్గురమ్మలను ప్రత్యేకంగా అలంకరించారు. పొంగళ్లు పొంగించి అమ్మవార్లకు నివేదించి మనుబోలు గ్రామస్తులు మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్ల కార్యక్రమంతో మనుబోలులో ఆలయాల వద్ద పండగ వాతావరణం నెలకొంది.

●ముత్తుకూరు : మండలంలోని పిడతాపోలూరులో కొలువైన గ్రామ దేవత పెద్దగూడెమ్మ, పోతురాజు స్వా మి పొంగళ్ల మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్లకు అర్చకులు విశేష పుష్పాలంకరణతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో జరిగే అమ్మవారి తిరునాళ్లలో భాగంగా ఉదయం గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మధ్యాహ్నం మేళతాళా లు బాణాసంచా సందడి మధ్య సామూహి కంగా గ్రామంలోని ప్రతి ఒక్కరు పొంగలి నివేదన చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వా హకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అత్యంత భక్తి శ్రద్ధల మధ్య పొంగళ్ల మహోత్సవం కన్నులపండువగా ముగిసింది.



మనుబోలులో పొంగళ్లు పొంగిస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో మనుబోలమ్మ



పిడతాపోలూరులో పెద్దగూడెమ్మ



ఘనంగా మాతా పరమేశ్వరి

జాతర ప్రారంభం

స్థానిక చెక్‌పోస్టు కాలనీలో ఉన్న మాతా పరమేశ్వరిదేవి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈసందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు కాలనీ మహిళలు మేళతాళాలతో పెన్నానది జలాలను కలశాలలో తీసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మైల తుడుపు, పుట్టబంగారం తీసుకువచ్చారు. అమ్మవారి మూలవిరాట్‌ను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా జరగనున్నాయి.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

వైభవంగా

తుమ్మాలమ్మ తిరునాళ్ల



మండలంలోని పాతదేవరాయపల్లిలో ఉన్న గ్రామదేవత తుమ్మాలమ్మ తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వగా పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)



నాగారపమ్మకు పూజలు

మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మదేవి ఆలయంలో ఆషాడ మాసం చివరి ఆదివారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షీర, పంచామృత, సకల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పూలతో అలంకరించారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నప్రసాద వితరణ జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

రైళ్లపై రాళ్లు రువ్వితే జైలుకే!

● ఐదేళ్లు శిక్షపడే అవకాశం

నెల్లూరు(క్రైం), జూలై 20(ఆంధ్రజ్యోతి) : ఎవరైనా రైళ్లపై రాళ్లు రువ్వితే జైలు శిక్ష తప్పదు. ఆడుకుంటూనో, ఆకతాయి తనంతోనో ఉద్దేశ పూర్వకంగానో... కారణం ఏమైనా రైలు బండి మీద రాయి వేస్తే జైలుకు పోవాల్సి వస్తుంది. ఈ విషయం తెలియక కొందరు యువకులు కటకటాల వెనుకకు వెళుతున్నారు.

ఆస్తి నష్టం కింద కేసు నమోదు



నడిచే రైళ్లపై రాళ్లు విసిరితే మనల్ని చూసేది ఎవరు, అయినా అంత చిన్న విషయాన్ని ఎవరు పట్టించుకుంటారు? అని ప్రజలు భావిస్తారు. అయితే రైళ్లపై రాళ్లు, మరేవైనా వస్తువులు విసిరిన సమయంలో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు గార్డులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన జరిగిన ప్రాంతంలోని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇలాంటి ఫిర్యాదులపై ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీఎస్ పోలీసులు ఆస్తి నష్టం కింద కేసు నమోదు చేస్తారు. వెంటనే సంఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లి రాళ్లు విసిరిన వారి కోసం గాలింపు చర్యలు చేపడతారు. రైల్వే పోల్స్, సిగ్నల్ పాయింట్స్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలిస్తారు. మొత్తం మీద రాళ్లు రువ్విన వారిని అదుపులోకి తీసుకొని జైలుకు పంపుతారు. ఈ కేసులో ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని పోలీసులు తెలుపుతున్నారు. అందుకని రైళ్లపై రాళ్లు విసిరడం మానుకోవాలి, అలా విసిరేవారికి దూరంగా ఉండటమూ మంచిది.

● జిల్లావ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులు 1500లకు పైగానే..
● రిజిస్ట్రేషన్ చేయించుకున్నవి మాత్రం 589
● 'ప్రైవేటు'లో నిబంధనలేవీ ? ● ఇష్టారాజ్యంగా రోగులకు చికిత్సలు
● చోద్యం చూస్తున్న వైద్య ఆరోగ్యశాఖ
● ప్రభుత్వాదాయానికి గండి

రిజిస్ట్రేషన్లు ఎక్కడ?

నెల్లూరు (వైద్యం) జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద సంఖ్యలో ప్రైవేట్ ఆసుపత్రులను నిర్వహిస్తున్నారు. ఎన్నో ఏళ్లగా ఇవి కొనసాగుతున్నా వైద్య ఆరోగ్యశాఖ మాత్రం చోద్యం చూస్తున్నది. ఏదైనా చిన్న వ్యాపారం చేయాలంటే బోలెడన్ని నిబంధనలుంటాయి. అయితే వ్యాధులకు చికిత్సలందించే అనుమతుల్లో మాత్రం అడుగడుగునా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. అసలు రిజిస్ట్రేషన్ లేకుండానే ఆసుపత్రులు నిర్వహించేవారు జిల్లాలో ఎంతోమంది ఉన్నారు. ఇలాంటి ఆసుపత్రుల్లో పొరపాటున ఎవరైనా చనిపోతే నష్టపరిహారం వచ్చే అవకాశం కూడా ఉండదు. నిబంధనల ప్రకారం ఓ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు కావాలి. అలా చేయ కుండా చికిత్సలు నిర్వహించే ఆసుపత్రులపై భారీ జరిమానాతోపాటు క్రిమినల్ కేసులు పెట్టవచ్చు. ఆ ఆసుపత్రులను సీజ్ కూడా చేయవచ్చు.



పొగతోటలో ఆసుపత్రుల సముదాయం

● 1500పైనే ఆసుపత్రులు

జిల్లావ్యాప్తంగా 1500లకుపైగా ఆసుపత్రులున్నట్లు సమాచారం. ఒక్క నెల్లూరు నగరంలోనే 500లకుపైగా ఆసుపత్రులున్నాయి. అయితే ఇందులో వైద్యశాఖ అనుమతులు పొందినవి మాత్రం 589 మాత్రమే. ఎప్పటికప్పుడు ఆయా ఆసుపత్రులపై దాడులు చేసి చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఆదిశగా అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

● ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రైవేటు ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ ద్వారా ప్రభుత్వానికి రూ. లక్షల్లో ఆదాయం వస్తుంది. సాధారణ క్లినిక్ అయితే రిజిస్ట్రేషన్‌కు రూ.1250 చెల్లించాలి. ఒకటి నుంచి 20 పడకల ఆసుపత్రికి రూ.3,750, ఆపై 50 పడకలకు రూ.7,500, 100 పడకలకు రూ.15వేల వంతున చార్జీలు చెల్లించాలి.ప్రతి ఐదేళ్లకొకసారి రిజిస్ట్రేషన్‌ను రెన్యూవల్ చేసుకోవాలి. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా 1500 లకుపైగా ఉన్న ఆసుపత్రుల ద్వారా రూ. లక్షల ఆదాయం ప్రభుత్వానికి రావాల్సి ఉంది. వైద్యశాఖ అధికారుల అక్రమార్జన, నిర్లక్ష్యం వల్లే పూర్తిస్థాయిలో ఆసుపత్రులు అనుమతులు పొందలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గుర్తించి చర్యలు తీసుకుంటాం



ప్రైవేటు ఆసుపత్రులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. కొన్ని ఆసుపత్రులు అనుమతులు తీసుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవు. జిల్లావ్యాప్తంగా వైద్యాధికారులు తనిఖీ చేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలుంది.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

యాక్సెస్ బ్యాంక్ కుంభకోణంపై డీఎస్పీ విచారణ

నెల్లూరు(క్రైం), జూలై 20(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని యాక్సిస్ బ్యాంకులో గతంలో జరిగిన కుంభకోణం కేసుపై నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆదివారం తన కార్యాలయంలో విచారణ జరిపారు. ఆ బ్యాంకు మేనేజర్ మదన్ మోహన్‌రావును ఆయన విచారించారు. ఈ కేసుకు సంబంధించి బ్యాంక్ ఇన్విస్టిగేషన్ టీమ్ ఇచ్చిన రిపోర్టుతోపాటు అన్నీ ఫైల్స్ తీసుకురావాలని గతంలో మేనేజర్‌కు సూచించారు. అయితే, ఆ ఫైల్స్ తమ వద్ద లేవని ఉన్నతాధికారులతో మాట్లాడి వాటిని అందిస్తానని మేనేజర్ చెప్పారు. కానీ, ఇప్పటి వరకు ఆ ఫైల్స్ అంజేయకపోవడంతో ఎందుకు ఆ ఫైల్స్ ఇవ్వలేకున్నారు అన్న అంశంపై డీఎస్పీ విచారించారు.

సీబీఐతో విచారణ జరపాలి

నెల్లూరు(హరనాథపురం), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని యాక్సిస్ బ్యాంకులో ఎస్టీల పేరుతో జరిగిన కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని యానా దుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య కోరారు. ఆదివారం నగరంలోని వెన్నెల కంటి రాఘవయ్య భవన్‌లో ఆయన బాధితులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆ బ్యాంకు నుంచి నలుగురు వ్యక్తులు రూ.15 కోట్లకు పైబడి కుంభకోణానికి పాల్పడ్డారని, వారికి బ్యాంకు సిబ్బంది కొందరు సహకరించారని ఆరోపించారు. దీనిపై కేసు నమోదు చేసి ఎనిమిది నెలలైందని, నిందితులను అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సం ఘం జిల్లా చైర్మన్ రాపూరు కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు మానికల మురళి, ప్రధాన కార్యదర్శి మాకాని రవీంద్ర, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఉద్యోగుల బ్రాంచి కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ నాయకులు

నెల్లూరు(హరనాథపురం), జూలై 20(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఇరిగేషన్ ఉద్యోగుల బ్రాంచి నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నగరంలోని డ్రైవర్స్ అసోసియేషన్ హాల్లో ఇరిగేషన్ సర్కిల్ బ్రాంచి మహాసభ పొదిలి చిన్నయ్య అధ్యక్షతన జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎస్కే రహమాన్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎస్కే ఖాదర్‌బాషా, ఉపాధ్యక్షుడిగా ఎస్కే హజుద్దీన్, కార్యదర్శులుగా ఏ శంకరయ్య, పీ సుబ్రహ్మణ్యం, ఎస్కే మస్తాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కొప్పాల చిరంజీవి, ఆర్‌అండ్‌బీ జిల్లా శాఖ అధ్యక్షుడు ఈవీఎం శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలి

రాష్ట్ర అధ్యక్షుడు బందగీ సాహెబ్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బందగీ సాహెబ్

నెల్లూరు (వైద్యం), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ రెవెన్యూ సహాయకు(వీఆర్‌ఏ)లకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బందగీ సాహెబ్ డిమాండ్ చేశారు. ఆదివారం నెల్లూరులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా నాల్గవ మహాసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు 8 ఏళ్లగా వేతనం పెంచలేదన్నారు. దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని చెప్పారు. అధికారంలోకి వస్తే వీఆర్‌ఏల వేతనాలు పెంచుతామని, నామినీలుగా పనిచేస్తున్న వారినీ వీఆర్‌ఏలుగా గుర్తిస్తామని గత ఎన్నికల్లో నారా లోకేష్ హామీ ఇచ్చారన్నారు. వాటిని వెంటనే నెరవేర్చాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ న్యాయమైన కోర్కెల సాధనకు వీఆర్‌ఏలు ఐక్యంగా ఉద్యమించాలని, వారికి సీఐటీయూ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం 15 మందితో జిల్లా కమిటీ ఏర్పాటైంది. అధ్యక్ష, కార్యదర్శులుగా వెన్నుపాటి లచ్చయ్య, ఓబులేసు, గౌరవాధ్యక్షుడిగా పెంచల నర్సయ్య ఎంపికయ్యారు. కార్యక్రమంలో సుబ్బయ్య, అమీర్, భాస్కర్, అంకయ్య, వెంకటకృష్ణ, సత్యవతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులతో భర్తపై కేసు

నెల్లూరు(క్రైం), జూలై 20(ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని పడారుపల్లికి చెందిన ఓ యువతికి కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లాకు చెందిన చేతన్ కుమార్‌తో ఈ సంవత్సరం మార్చిలో పెద్దలు వివాహం చేశారు. కొంతకాలం తర్వాత వివాహిత ఫిట్స్‌తో అనారోగ్యానికి గురవడంతో ఆమెను భర్త మాటలతో వేధించడం ప్రారంభించాడు. మూడు నెలల కిందట నెల్లూరులోని తల్లిదండ్రుల వద్ద వదిలి వెళ్లాడు. రూ.15లక్షలు అదనపు కట్నం తెస్తేనే కాపురానికి రావాలని, లేకుంటే విడాకులు ఇవ్వాలని భర్త ఆమెను బెదిరించాడు. పెద్దలు సర్దిచెప్పినా అతనిలో మార్పు రాకపోవడంతో బాధితురాలు ఆదివారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్పీకి స్వల్ప అస్వస్థత

● కిమ్స్ ఆసుపత్రికి తరలింపు

నెల్లూరు(క్రైం), జూలై 20(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదివారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో నేర సమీక్ష ముగించుకొని అతిథులతో కలిసి పక్కనే ఉన్న పోలీసు గెస్ట్‌హౌస్‌కు నడుచుకుంటూ వెళ్లారు. అక్కడ ఒక్కసారిగా కళ్లుతిరిగి పడిపోవడంతో అధికారులు హుటాహుటిన కిమ్స్ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షలు జరిపి చికిత్స చేశారు. ప్రస్తుతం ఎస్పీ ఆరోగ్యంగానే ఉన్నారని వైద్యులు తెలిపారు. గతంలోనూ ఎస్పీ అస్వస్థతకు గురై వైద్యశాలలో చికిత్స పొందిన విషయం విదితమే.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయాలపాలైన ఓంకార్

ఉదయగిరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన పట్టణ శివారు ప్రాంతమైన సీతారామపురం మార్గంలో 167-బీజీ జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. సీతారామపురానికి చెందిన మీనిగ ఓంకార్ జువ్వలదిన్నె సచివాలయంలో ఫిషరిస్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మోటార్‌బైక్‌పై స్వగ్రామమైన సీతారామపురానికి వెళుతూ పట్టణ శివారు ప్రాంతంలోని జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొని కిందపడ్డాడు. దీంతో అతనికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు వైద్యశాలకు చేరుకుని వివరాలు సేకరించారు.

సాఫ్ట్‌బాల్ సంఘం జిల్లా కార్యవర్గం ఎంపిక



సాఫ్ట్‌బాల్ సంఘం నూతన కమిటీ

నెల్లూరు(విద్య), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం సాఫ్ట్‌బాల్ జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మలిరెడ్డి కోటారెడ్డి, ఉపాధ్యక్షులు గా నరహరి, మాలకొండయ్య, కార్యదర్శిగా సీహెచ్ కామేశ్వరి, సంయుక్త కార్యదర్శులుగా పీ వేణు, జీ మహేష్, టీ హరి, కోశాధికారిగా బీ సుకృత ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ ఎన్నికలను రాష్ట్ర పరిశీలకులు పీ నరసిం హారెడ్డి, ఆర్ నరేష్, జిల్లా ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కే గురుప్రసాద్, డీఎస్‌ఏ ప్రతినిధి జసీమ్ పర్యవేక్షించారు. ఎంపికైన సభ్యులను క్రీడాకారులు, కోచ్‌లు అభినందించారు.

వెంకటాచలం మండలంలో ఇద్దరికి...

వెంకటాచలం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వేపల్లి సమీపంలోని ఇస్కపాళెం తూముల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. నెల్లూరు నగరంలోని డైకస్‌రోడ్డు ప్రాంతానికి చెందిన సునీల్, రియాజ్ పంటపాళెం వద్ద ఉన్న ఓ అయిల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. పని ముగించుకుని మోటర్ బైక్‌పై నెల్లూరుకు వెళ్తుండగా తూముల సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా వచ్చిన ఆటో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను సర్వేపల్లిలోని ఓ ప్రైవేటు క్లినిక్‌కు తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



జలదంకిలో జరిగిన అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్న నాయకులు తిరుపతిరావు, ప్రసాద్, శంకరయ్య, రాధాకృష్ణ

అగ్రిగోల్డ్ బాధితుల కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలి

● అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ సంఘం డిమాండ్

జలదంకి, జూలై 20(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన అగ్రిగోల్డ్ బాధితుల సమావేశంలో వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రప్రధానకార్యదర్శి బీ.తిరుపతిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీవీ.ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఎస్.శంకరయ్య, జిల్లా కార్యవర్గసభ్యుడు ఎం.రాధాకృష్ణలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి అగ్రిగోల్డ్ ఆస్తులు గుర్తిస్తుండడం అభినందనీయమన్నారు. అయితే గత ప్రభుత్వం లాగా కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా బాధితులకు తక్షణ పరిష్కారం కావాలంటే ప్రత్యేక కోర్టు ఏర్పాటు అవసరమన్నారు. అలా కాకుండా కాలయాపన చేస్తే మరో ఉద్యమాన్ని చేయాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం మండల నాయకుడు గడ్డం మాల్యాద్రి, పాల్గొన్నారు.

'గండికోట'కు భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం



ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం అందుకుంటున్న గండికోట సుధీర్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బుచ్చినగర పంచాయతీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, సామాజిక వేత్త గండికోట సుధీర్ కుమార్‌కు భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం లభించింది. ఆదివారం విజయవాడలోని అంబేద్కర్ స్మృతి వనంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ఎం.ధ్యానచంద్ర ఆయనకు భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం అందజేసి సత్కరించారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 77మంది తెలుగు కవులతో 'ప్రణామం' పేరుతో కవితా సంకలనం రూపొందించినందుకు మల్లెతీగ సాహితీ సంస్థ అధ్యక్షులు కలిమిశ్రీ, ఉపాధ్యక్షులు చొప్పా రాఘవేంద్ర శేఖర్, కవులు, రచయితలు, సామాజిక వేత్తలు, ఉపాధ్యాయులు సుధీర్ కుమార్‌ను అభినందించారు.

సోమశిలకు 3,347 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 3,347 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 27.645 టీఎంసీలు నీరు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 350, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 4,250 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కండలేరు నీటిమట్టం 29.707 టీఎంసీలు

రాపూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కండలేరు పూర్తిస్థాయి నీటి మట్టం 68 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 28.805 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యాం ఏఈ కట్టా తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో నీరు ఏమీ లేకపోగా, అవుట్‌ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుంచి 2500 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ నుంచి 100 క్యూసెక్కులు మొత్తం 2600 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో అవుతుందని కండలేరు ఏఈ తెలిపారు.

హౌసింగ్ ఏఈల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్వర్లురెడ్డి



రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లురెడ్డి



రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పెంచలయ్య

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్స్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డీ వెంకటేశ్వర్లురెడ్డి ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం ఆ సంఘం కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. జిల్లాకు రెండు కీలక పదవులు దక్కాయి. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటే శ్వర్లురెడ్డితో పాటు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కేసీ పెంచలయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని సహచర ఉద్యోగులు, అధికారులు అభినందించారు.

బైక్ కాలువలో పడి ఇద్దరికి గాయాలు



అదుపు తప్పి కాలువలో పడిన మోటారుబైక్

కలువాయి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మోటారు బైక్ అదుపుతప్పి కాలువలో పడి ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం సాయంత్రం రాజుపాళెం పరమానంద ఆశ్రమం వద్ద జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సోమశిల వైపు నుంచి ఇద్దరు యువకులు మోటారుబైక్ వస్తూ అదుపు తప్పి రోడ్డుపై నుంచి సుమారు 10 అడుగుల పైగా లోతు ఉండే కాలువలో పడిపోయారు. దీంతో స్వల్ప గాయాలైన వారిని స్థానికులు ఆటోలో వైద్యశాలకు తరలించారు. గాయపడినవారి వివరాలు తెలియరాలేదు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	131
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	258

కోడిగుడ్ల ధర (100): 520

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9445
వెండి కిలో ధర	రూ. 115800
వెండి ఒక గ్రాము	రూ.118.80

4వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

కావలి(టౌన్), జూలై 20(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో భాగంగా సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్మికుల సమ్మె ఆదివారం నాలుగో రోజుకు చేరింది. సీనియర్ సీఐటీయూ నాయకులు మధుసూదన్‌రావు శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య, యూనియన్ నాయకులు టీ.శీనయ్య, క్రాంతికుమార్, మహేష్, రమేష్, షాన్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించుకోండి

అల్లూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో పెండింగ్ కేసులు పరిష్కరించుకోవాలని లోక్ అదాలత్ మధ్యవర్తిత్వం కేంద్రం సభ్యులు మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కోర్టుల్లో అనేక కారణాల వలన కేసులు పేరుకుపోతున్నాయని, వాటిని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. సమయాన్ని, డబ్బుని వృథా కానీయకుండా ఈ మధ్యవర్తిత్వం కేంద్రం పనిచేస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకొని పెండింగ్‌లో ఉన్న కేసుల నుండి విముక్తి పొందాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లింగసముద్రం, జూలై 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినపవని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ విజయ్‌బాబు, మండల విద్యుత్ ఏఈ షేక్ ఫిరోజ్‌లు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల కారణంగా చినపవని, పెదపవని, మేదరమెట్లపాలెం, ముత్యాలపాడు, ముత్తంవారిపాలెం గ్రామాలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు పేర్కొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్క నాటాలి

బిట్రగుంట, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలని వాకర్స్ అధ్యక్షుడు బీ.బర్నాడ్ అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో కోవూరుపల్లి డిజిటల్ అసిస్టెంట్ మర్రి శ్యామ్‌సుధాకర్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. క్రీడాకారులకు స్టార్ ఫ్రెండ్స్ తిరుమల, అనిల్, శ్యామ్, రాజీవ్‌లు పౌష్టికాహారాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాలు, జీవన్‌కుమార్, శ్రీనివాసులు, ఎన్.ఎస్ యాదవ్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతికి సంతాపం

లింగసముద్రం, జూలై 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగిరేకులపాడుకు చెందిన టీడీపీ బీసీ నాయకుడు బత్తుల వీరాస్వామి (62) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వేముల గోపాలరావు, ఆ గ్రామ మాజీ సర్పంచు ముప్పరాజు వెంకటేశ్వర్లు తదితర నాయకులు వీరాస్వామి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వీరాస్వామి మృతికి సంతపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్!

● శ్రీనగర్, ఇందిరమ్మ కాలనీల మలుపులో గుంతలు



శ్రీనగర్ కాలనీకి వెళ్లే రోడ్డు మార్జిన్‌లో ఏర్పడిన గుంత

కావలి రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రహదారి మార్జిన్లు ప్రమాదకరంగా ఉన్నాయి. పట్టణంలోని కొత్త శివాలయం రోడ్డు నుంచి శ్రీనగర్ కాలనీకి వెళ్లే రోడ్డు మలుపు వద్ద రోడ్డు మధ్యన ఏర్పాటు చేసిన తూముతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. శివాలయం దగ్గర నుంచి ముసునూరు ఇందిరమ్మకాలనీకి ఇటీవల నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఆ సమయంలో శ్రీనగర్ కాలనీ రోడ్డుకు ఇరువైపుల ఉన్న స్థలాల్లో వర్షపు నీరు రోడ్డు దాటి ప్రవహించేందుకు సీసీ రోడ్డు నిర్మాణ సమయంలో తూములు ఏర్పాటు చేసి వదిలేశారు. దీంతో శ్రీనగర్ కాలనీ రోడ్డు మలుపు మధ్యన తూము ఉండడంతో అక్కడ మట్టి పొయ్యకుండా వదిలేశారు. దీంతో శ్రీనగర్ కాలనీ రోడ్డు మధ్యన, ఇందిరమ్మకాలనీకి వెళ్లే రోడ్డు మార్జిన్‌లో పెద్ద గొయ్య ఉండటంతో రాత్రి సమయాల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఆ ప్రాంతంలో మరో తూము ఏర్పాటు చేసి రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యిలను పూడ్చి ప్రమాదాలు అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మికుల హక్కులు కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

● టీయూసీసీ రాష్ట్ర అధ్యక్షుడు డీవీఎన్ రాజు



మాట్లాడుతున్న డీవీఎన్ రాజు

కావలి(టౌన్), జూలై 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు కాలరాస్తున్నాయని ట్రేడ్ యూనియన్ కోఆర్డినేషన్ సెంటర్ (టీయూసీసీ) రాష్ట్ర అధ్యక్షుడు డీవీఎన్ రాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఓ కల్యాణ మండపంలో టీయూసీసీ కేంద్ర కమిటీ సభ్యుడు టీ.రామచంద్రయ్య అధ్యక్షతన జరిగిన నేతాజీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమా వేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

నూతన కమిటీ ఎంపిక : నేతాజీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కావలి శాఖ నూతన కమిటీ అధ్యక్షుడుగా కే.ఏసు, ఉపాధ్యక్షుడుగా శెట్టిపల్లి మనోహర్, ప్రధాన కార్యదర్శిగా శెట్టిపల్లి రవి, సంయుక్త కార్యదర్శిగా భాను ప్రకాష్, కోశాధికారిగా ఆదిలక్ష్మి, జాయింట్ కోశాధికారిగా ఎలమం దలయ్య ఎంపికయ్యారు.

భార్యపై భర్త కత్తితో దాడి

దగదర్తి(బిట్రగుంట), జూలై 20(ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో భర్త కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన ఆదివారం కుటుంబ విషయమై మున్వర్ సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన షేక్.మున్వర్ జీవనోపాధి నిమిత్తం కొంత కాలం క్రితం భార్యాబిడ్డలతో దగదర్తి మండలం తడకలూరుకు వచ్చారు. గ్రామంలో చికెన్ దుకాణం నిర్వహించడంతోపాటు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో భార్య సుల్తానా ప్రవర్తనపై అనుమానం ఉన్న మున్వర్ ఈనెల 18వ తేదీ గొడవ పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి కత్తితో దాడికి దిగి విచక్షణా రహితంగా కాళ్లు, చేతులను నరికాడు. తీవ్ర గాయాలైన ఆమెను చికిత్స నిమిత్తం రాజుపాలెంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు భర్తే తీసుకెళ్లాడు. అక్కడ వాళ్లు వైద్యం చేసేందుకు నిరాకరించడంతో అక్కడి నుంచి ఆమెను ఆమె బంధువులు నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రభుత్వ వైద్యుల ద్వారా అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ జంపానికుమార్ తెలిపారు.

చంద్రబాబుకు ఆర్యవైశ్యులు రుణపడి ఉంటారు

● సీఎం చిత్రపటానికి పాలభిషేకం



సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న ఆర్యవైశ్యులు, టీడీపీ నేతలు

కావలి, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఆర్యవైశ్యులు జీవితాంతం రుణపడి ఉంటారని కావలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ తెలిపారు. అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనంకు రాష్ట్ర ప్రభుత్వం 6.8 ఎకరాలు భూమి కేటాయిచి ఆయన విగ్రహం ఏర్పాటుకు తీర్మానిస్తూ నిర్ణయం తీసుకున్నందుకు కావలి ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సీఎం చిత్రపటానికి ఆర్యవైశ్య ప్రముఖులతోపాటు టీడీపీ నేతలు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం, ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు స్మృతివనంను సుమారు రూ.500 కోట్లతో అమరావతిలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నందుకు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కూటమి నేతల రుణం ఆర్యవైశ్యులు తీర్చుకోలేనిదన్నారు. అలాగే కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆర్యవైశ్యులకు ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే స్పందిస్తూ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నియోజకవర్గంలో కీలకమైన ఏఎంసీ చైర్మన్ పదవిని ఆర్యవైశ్య నేత పోతుగంటి అలేఖ్యకు ఇచ్చారన్నారు. ఆర్యవైశ్యులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నందుకు ఆయనకు ఊడా రుణపడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘ కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి చక్రి, టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, పోట్లూరు శ్రీనివాసులు, అమరా వేదగిరి సబ్బరాయుడు గుప్తా, తిరువీధి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జువ్వలదిన్నెలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'



ప్రభుత్వ ఏడాది పాలనపై ఇంటింటికి కరపత్రాలు అందజేస్తున్న మాలేపాటి, తదితరులు

బిట్రగుంట, జూలై 20(ఆంధ్రజ్యోతి): జువ్వల దిన్నెలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి పనులు వివరిస్తూ సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి ఇందుపూరు రామో హన్‌రెడ్డి, నేతలు కడియాల గోవిందు, ఆవుల చిన్నేడు, కొండూరు వినోద్, సుబ్రమణ్యం, పోలయ్య, వాయిలశీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సేవకుడిగా పనిచేస్తా...

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజలకు సేవకుడిలా పనిచేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని 27వ వార్డు విప్పగుంట రోడ్డులో ఆదివారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ముందుగా వినాయకుడి గుడిలో పూజలు చేసి కార్యక్రమా న్ని ప్రారంభించిన ఆయన ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గడచిన ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, శివసూర్య, ముచ్చు శ్రీను, చిలకపాటి మధు, షేక్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతోంది



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీద గిరిధర్ తదితరులు

అల్లూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన కొనసాగుతోందని సోమశిల కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. మండలంలోని ఇస్కపల్లి పంచాయతీ పరిధిలోని శంబునిపాలెంలో ఆదివారం ఇంటింటికి తిరిగి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రజలకు వివరించారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరాజ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ప్రేమగా చూడాలి

కావలి, జూలై 20(ఆంధ్రజ్యోతి): వృద్ధులను ప్రతి ఒక్కరు గౌరవంగా, ప్రేమగా చూడాలని డీఆర్ విశ్వోదయ సేవా సమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి పేర్కొన్నారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో డీఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో వెంగళరావునగర్‌లోని కార్యాయంలో ఆదివారం 60 మంది వృద్ధులకు బియ్యంచ తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఉందుగా డీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జేబీ సెల్ఫ్‌ఫైనాన్స్ డైరెక్టర్ మాల్యాద్రి, సమితి సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతలకు పొంగళ్లు



పొంగళ్ల సామగ్రితో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఉదయగిరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ దుర్గంపల్లి గ్రామంలో ఆదివారం గ్రామదేవతలైన పోలేరమ్మ, అంకాళమ్మలకు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బుట్టల్లో పొంగళ్ల సామగ్రితో మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ గ్రామ పుర వీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం చుటూ ప్రదక్షణలు చేసి అనంతరం పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యంతోపాటు కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. పాడిపంటలు, ఆయురారోగ్యాలతో గ్రామం ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గంగాభవానీకి పాలపొంగళ్లు

వింజమూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండెమడకల గ్రామంలో వున్న గంగాభవానీ అమ్మవారికి ఆదివారం ఘనంగా పాలపొంగళ్లు నిర్వహించారు. యాదవ యూత్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం బండ్లు తిరుగుడు, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాలను అందజేశారు.

రేపటి నుంచి గంధమహోత్సవం



గంధమహోత్సవానికి ముస్తాబైన దర్గా

ఉదయగిరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్‌సాహెబ్ ఖాదరీ ఔలియా వారి 220వ గంధ మహోత్సవం మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం సందల్‌మాలి కార్యక్రమంతో గంధ మహోత్సవం ప్రారంభమవుతుందని, శుక్రవారం తహలీల్ ఫాతెహా కార్యక్రమాలతో ముగుస్తుందన్నారు. గంధమహోత్సవం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ, పాటకచ్చేరీ, ఖవ్వాలీ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

'కుమ్మిత' సేవలు అభినందనీయం



సన్మానం అందుకుంటున్న కుమ్మిత దంపతులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తితో పాటు సమాజ సేవలోను కుమ్మిత శ్రీనివాసులురెడ్డి చేసిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం జీ.కొత్తపల్లిలోని ఆయన స్వగృహంలో కుటుంబీకులు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లా డుతూ ఇటీవల జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆయన సేవాగుణానికి నిదర్శనమన్నారు. అనంతరం కుమ్మిత దంపతులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, సర్పంచు కుమ్మిత ప్రతాప్‌రెడ్డి, న్యాయవాది శేషారెడ్డి, ఎంఈవో మస్తాన్‌వలి, ఎం సుబ్బారావు, మందలపు తిరుపతినాయుడు, ఆంధ్ర బాలగురవారెడ్డి, చంద్ర వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు దుత్తలూరు మండల సమావేశం

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హనుమంతరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

రాష్ట్రంలో చంద్రబాబు సుపరిపాలన : ఎమ్మెల్యే కాకర్ల



ఉదయగిరి: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



సంగం: ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు ఇస్తున్న టీడీపీ నేతలు

ఉదయగిరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగా లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. ఆదివారం ఉదయగిరి పట్టణంలోని దేవలాలగడ్డ, తుపాన్‌నగర్, ఈద్గామిట్ట తదితర ప్రాంతాల్లో టీడీపీ నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీచేసి ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వైసీపీని గెలిపిస్తే మళ్లీ అధోగతి పాలవుతారని, పురోగతి ఉండదన్నారు. సుపరిపాలన అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● **సంగం:** మండలంలోని సిద్దీపురంలో అన్నారెడ్డిపాళెం సాగునీటి సంఘం అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కొర్రపాటి మంజులనాయుడు, టీడీపీ బూత్ కన్వీనర్, కో కన్వీనర్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



నూతనంగా ఎంపికైన ఆశా కార్యకర్తల కమిటీ సభ్యులు

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, ఉపాధ్యక్షురాలు మేరీ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పీహెచ్‌సీలో నర్రవాడ, దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆశా కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన తొమ్మిది ఒప్పంద జీవోలను ప్రస్తుత ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు నెలకు రూ.26 వేలు వేతనం చెల్లించాలన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన ఆశా కార్యకర్త కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతోపాటు పదవీ విరమణ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. అనంతరం 11 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ కార్యదర్శులు గుజ్జుల మల్లికార్జున, సింహాద్రి పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ



ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు, మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాం చేస్తామని సీఐటీయు నాయకులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎలక్ట్రిసిటీ కార్మికులు, యుటీఎఫ్, ఎల్ఐసీ తదితర అనుబంధ సంఘాల నాయకులు ఆదివారం ఆత్మకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా నాయకులు జీవీ శివప్రసాద్, మున్సిపాల్టీ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య, యుఈఈయు రీజనల్ అధ్యక్షుడు కొండమూరి హజరత్తయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబరు 36 ప్రకారం వెంటనే జీతాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పి రాధమ్మ, రమణమ్మ, ఎల్ఐసీ, యుటీఎఫ్, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు టి రమేష్, బి శివప్రసాద్, యు నరసింహులు, షేక్ హయత్‌బాష, ఈఈయు డివిజన్ నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌పేటలో ఉచిత కంటి వైద్య శిబిరం

ఏఎస్ పేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు సుశీల నేత్రాలయ ఆసుపత్రి వారి సహకారంతో స్థానిక హబీబియా క్లినిక్‌లో డా ఖాజామియ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా కంటివైద్యులు విజయ్ సుమారు 120 మందికి కంటి పరీక్షలు చేసి అందులో 40 మందికి ఆపరేషన్ అవసరం అని తెలిపారు. ఈకార్యక్రమంలో టెక్నీషియన్‌లు ఫిరోజ్, నరసింహ, మెయిద్, పిఆర్‌ఓ షాకీర్, హబీబియా క్లినిక్ సిబ్బంది, టిడిపి నాయకులు ఎంబిటి బాబు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు ఘన సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న గ్రామస్థులు


సంగం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగారెడ్డిపాళెం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఐదుగురు సచివాలయ ఉద్యోగులను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అనంతసాగరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరు ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1989-90 విద్యాసంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన వారందరూ పాఠశాలకు చేరుకొని ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆపాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ఆత్మకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ చంద్రా విజయమ్మ తెలిపారు. ఆదివారం స్థానిక షిర్డీసాయి పిరమిడ్ కేంద్రంలో మౌన ధ్యానం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ధ్యానంతో బుద్ధిబలం పెరగడంతో పాటు శరీరంలో నాడీశుద్ధి జరిగి రోగాలు దూరమవుతాయన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం ఉపయుక్తమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ధ్యానసాధకులు తదితరులు పాల్గొన్నారు.







అడవి పూసిన అందాలు

వానలు కురుస్తున్నాయి. చినుకు తడి తగిలిన చెట్టూచేమా పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. నేల రాలిన ఎండుటాకులు మట్టిలో మగ్గిన కమ్మటి వాసన అడివంతా పరచుకుంటోంది. ప్రకృతి కొత్త జీవులకు పురుడుపోస్తోంది. వాన వెలిసి ఎండపొడ పడినతావుల్లోంచి వెచ్చని ఆవిరి పొగలా పైకి లేస్తోంది. అడవిపూలను వెతుక్కుంటూ రంగురంగుల సీతాకోకచిలుకలు తిరుగుతున్నాయి. నేల పిగిలినట్టుగా, చెట్లు పూసినట్టుగా ఎటు చూసినా సీతాకోకచిలుకల గుంపులు తిరుమల అడవుల్లో కనువిందు చేస్తున్నాయి. శేషాచలం కొండల్లో దాదాపుగా 106 జాతుల సీతాకోకచిలుకలు ఉన్నట్టు ఒక అంచనా. అయితే కేవలం 5 కుటుంబాలకు చెందిన 50 జాతులనే ఇప్పటిదాకా వివిధ అధ్యయనాల్లో గుర్తించారు. తిరుమలతో పాటూ తలకోన, మామండూరు, బాలపల్లి, దివ్యారామం ప్రాంతాల్లో సీతాకోకచిలుకలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. నల్లటి రెక్కలమీద ఎర్రటి మచ్చలుండే కామన్‌రోజ్, నలుపుతో పోటీపడే గాఢ నీలిరంగు మచ్చల బ్లూటైగర్, లేత, గాఢ పసుపు రంగు పూసినట్టుగా ఉండే లెమన్ ఎమిగ్రెంట్ రకాలు తిరుమల అడవుల్లో అత్యధికంగా కనిపిస్తున్నాయి. నిజానికి వీటి జీవితకాలం రెండు నెలలలోపే అయినా ప్రకృతి ధర్మాన్ని నెరవేర్చడానికి సంబరంగా సందడిగా ఎగురుతూ వాలుతూ అడవంతా అందాలు పంచుతున్నాయి.

- స్టాఫ్ ఫోటోగ్రాఫర్, తిరుపతి



చెవిరెడ్డి చుట్టూ తుడా ఉచ్చు

4300 పేజీల నివేదిక అందజేసిన విజిలెన్స్

పక్కాగా ఫొటోలు, ఆధారాలు

ప్రభుత్వ ఆదేశాలతో కేసు నమోదుకు అవకాశం

తిరుపతి(నేరవిభాగం), జూలై 20(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్‌లో అరెస్టయి ప్రస్తుతం జైల్లో ఉన్న తుడా మాజీ ఛైర్మన్, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చుట్టూ తుడా ఉచ్చు బిగుసుకుంటోంది. తుడాలో నిధుల దుర్వినియోగానికి సంబంధించి తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు అధికారులు ప్రభుత్వానికి దాదాపు 4300 పేజీల నివేదికను పంపారు. దీంతో ప్రతి పైసాకు లెక్క చెప్పాల్సిన పరిస్థితి చెవిరెడ్డికీ, అప్పటి తుడా అధికారులకూ ఎదురైంది. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు దాదాపు రూ.380 కోట్ల పైచిలుకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా ఖర్చు చేసినట్లు విజిలెన్సు నివేదికలో పొందుపరిచారు. ఇందులో ఎక్కువ శాతం నిధులు సొంత ప్రయోజనాలకు వాడుకున్నట్లు ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. చివరకు తెలంగాణ ఎన్నికల సమయంలోనూ పొలిటికల్ సర్వే కోసం తుడా డబ్బును వాడినట్లుగా అధికారులు గుర్తించారు. తుడా నిధులు దాదాపు 90 శాతం వరకు చంద్రగిరి నియోజకవర్గంలోని పనులకు మళ్లించారు. ఇలా చేయడం నేరమని అధికారులు ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. ఇక చెవిరెడ్డి సొంత ఊరైన తుమ్మలగుంట ట్యాంక్ ఆధునికీకరణ పేరుతో కోట్లు దుర్వినియోగం అయిందనీ, ప్రజాధనంతో బెంచీలు ఏర్పాటు చేసి వాటిపై వారి పేర్లు రాసుకున్నారనీ, తుడా ఛైర్మన్‌గా ఉన్నప్పుడు వ్యక్తిగత పర్యటనలకు కూడా తుడా డబ్బులే ఖర్చు చేశారనీ అధికారుల నివేదికలో పొందుపరిచారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీడీవోలకు అనధికారికంగా పనులు, బడ్జెట్ కేటాయించినట్లు చూపించారు. ఆ నిధులను వ్యక్తిగత ఖాతాలో జమచేశారు. అలాగే చెవిరెడ్డి కుటుంబానికి చెందిన సీఎంఆర్ కంపెనీనే చాలా కాంట్రాక్టు పనులు చేపట్టింది. మొత్తంగా చెవిరెడ్డి కుటుంబం తుడా నుంచి భారీగానే నిధులు దుర్వినియోగం చేసినట్లు విజిలెన్సు తేల్చింది. అయితే ఛైర్మన్‌కు సంతకం చేసే అధికారం లేదని, తనకేం తెలియదని చెవిరెడ్డి మీడియా సమావేశంలో చెప్పారు. దీనిద్వారా తన మాటవిని సంతకాలు పెట్టిన అధికారుల మెడకు కూడా ఉచ్చు బిగుసుకునేలా చేశారాయన. తుడా నిధుల దుర్వినియోగంపై విజిలెన్సు విచారణలో గుర్తించిన అంశాలను బట్టీ ఆయన తప్పించుకోలేరని అధికారుల వాదన. దీంతో లిక్కర్ స్కాం కేసులో అరెస్టయి జైలులో ఉన్న చెవిరెడ్డి మెడకు తుడా నిధుల దుర్వినియోగం కేసు కూడా చుట్టుకున్నట్టే అంటున్నారు.





పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డుపై లారీ నుంచి పడిన బండరాయి - పరదాల మాటున బండరాళ్లను తరలిస్తున్న లారీ

పరదాల మాటున బండరాళ్ల తరలింపు

● లారీ నుంచి ఒకటి కింద పడటంతో గుట్టు రట్టు

కేవీబీపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా, పరదాల మాటున బండరాళ్లు తరలిపోతున్నాయి. కేవీబీపురం మండలం మఠం సమీపంలోని ఓ మైనింగ్ కంపెనీకి సంబంధించిన టిప్పర్ ఆదివారం ఉదయం 40 టన్నుల బరువైన బండరాళ్లను లోడ్ చేసుకుని పరదా కప్పి చెన్నైకి బయలుదేరింది. కేవీబీపురం పోలీస్‌స్టేషన్ సమీపంలో స్పీడ్‌బ్రేకర్ వద్ద వాహనం వెనుక తలుపు తెరచుకుని పెద్దబండరాయి నడిరోడ్డుపై పడింది. డ్రైవర్ గుర్తించకుండా వెళ్తుండగా స్థానికులు టిప్పర్‌ను ఆపారు. వాళ్లు ఆపకుంటే మరో బండరాయి రోడ్డు మీద పడేది. దీన్ని గమనించిన కానిస్టేబుల్ టిప్పర్‌ను రోడ్డు పక్కన ఆపించారు. ఇటీవల బ్రాహ్మణపల్లె పరిసర గ్రామాల ప్రజల ఫిర్యాదు మేరకు క్రషర్ కంపెనీని సీజ్ చేశారు. అయితే యాజమాన్యం ఇక్కడ క్రషింగ్‌ను నిలిపి రాత్రిళ్లు డిటొనేటర్లు పేల్చి పెద్ద బండరాళ్లను టర్బోజెట్ లారీల్లో చెన్నైకి తరలిస్తోంది. ఆదివారం టిప్పర్‌లో నుంచి బండరాయి కిందపడటంతో అసలు గుట్టు రట్టయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సీజ్ చేసిన కంపెనీ నుంచి బండరాళ్లు ఎలా బయటకు తరలిస్తున్నారనే విషయంపై విచారణ జరిపించాల్సి ఉంది.



పడటానికి సిద్ధంగా ఉన్న మరో బండరాయి

టేకాఫ్ కాగానే సాంకేతిక సమస్య

● అరగంటపాటు గాల్లో చక్కర్లు

● చివరకు రద్దయిన ఇండిగో విమాన సర్వీసు

రేణిగుంట, జూలై 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో ఆదివారం రాత్రి టేకాఫ్ అయిన కొంతసేపటికే ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. కాసేపు గాల్లో చక్కర్లు కొట్టి.. ఆ తర్వాత ల్యాండింగ్ చేసి సర్వీసును రద్దు చేశారు. ప్రయాణికులు తెలిపిన ప్రకారం.. హైదరాబాదు నుంచి ఆదివారం రాత్రి 7.10 గంటల సమయంలో తిరుపతికి వచ్చిన ఇండిగో విమానం.. ఇక్కడ నుంచి 7.30 గంటలకు 200 మంది ప్రయాణికులతో టేకాఫ్ అయింది. కొంతసేపటికి సాంకేతిక సమస్య తలెత్తడంతో, అరగంట పాటు గాల్లో చక్కర్లు కొట్టి తిరిగి 8 గంటలకు రన్‌వేపై ల్యాండైంది. విమానంలో ఉన్న ప్రయాణికులను వెయిటింగ్ ప్రాంతానికి పంపించి 8.30 గంటలకు ప్రయాణికులకు బోర్డింగ్ పాసులు అందించారు. ఆ తర్వాత విమానంలోకి ప్రయాణికులను పంపారు. కొంతసేపటికి విమానంలో తిరిగి సాంకేతిక సమస్య తలెత్తిందంటూ ప్రయాణికులను వెనక్కి పంపేశారు. సాంకేతిక కారణాలతో విమాన సర్వీసును రద్దు చేస్తున్నట్లు రాత్రి 9 గంటలకు అధికారులు ప్రకటించారు. దీంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. టిక్కెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు రీఫండ్ చేస్తామని యాజమాన్యం తెలపడంతో వెనుదిరిగారు.



ప్రత్యేక అలంకారంలో శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి

హరోం.. హర

● విజ్ఞానగిరికి పోటెత్తిన భక్తులు



శ్రీకాళహస్తి, జూలై 20(ఆంధ్రజ్యోతి): హరోం హర అంటూ భక్తులు విజ్ఞానగిరికి పోటెత్తారు. పసుపు దుస్తులతో కావళ్లు మోస్తూ మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈనెల 15 నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఆడికృత్తిక సందర్భంగా కుమారస్వామి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. నారద పుష్కరిణి వద్ద రాత్రి 8.30గంటల వరకు సుమారు8,500 మంది భక్తులు తలనీలాలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. ఇక 2,700మంది స్వామికి కావళ్లు సమర్పించారన్నారు. ఆడికృత్తిక సందర్భంగా ఉదయం వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి ఇంద్రవిమానంపై పురవిహారం చేశారు.

సృజనాత్మకతతో ముందుకు సాగండి

● కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టండి

● తిరుపతి ఐఐటీ స్నాతకోత్సవంలో క్రియా వర్సిటీ చాన్సలర్ సూచన



సజ్జన్ జిందాల్, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ గవర్నర్స్ అవార్డు అందుకుంటున్న మేఘ వర్షిణి



డిగ్రీలు అందుకున్న ఐఐటీ విద్యార్థుల గ్రూప్ ఫొటో

ఏర్పేడు, జూలై 20(ఆంధ్రజ్యోతి): పట్టుదల, సృజనాత్మకతతో ముందుకు సాగాలంటూ విద్యార్థులకు క్రియా యూనివర్సిటీ చాన్సలర్ లక్ష్మీనారాయణన్ సూచించారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో ఆదివారం జరిగిన 7వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడారు. ఎల్‌ఈజీవో వ్యవస్థాపకుడు ఓలే కిర్క్ క్రిస్టియన్సన్ జీవితాన్ని ఉదహరించిన ఆయన.. కష్టాలను ఎదుర్కొంటూ ఎలా గొప్ప విజయాలను సాధించవచ్చో వివరించారు. అదే తరహాలో కృషి పట్టుదలతో కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. స్పేస్ టెక్నాలజీ, స్టార్టప్ పికెల్స్ గురించి వివరించారు. హైపర్ స్పెక్ట్రల్, ఇమేజింగ్ అనే సాంకేతికతను ఉపయోగించి వ్యవసాయం, మైనింగ్, పర్యావరణం వంటి రంగాల్లో డేటా ఇవ్వడానికి ఉపగ్రహాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా డ్రోన్ ఆధారిత పరిష్కారాలపై పరిశోధనలు జరుగుతుండటాన్ని గుర్తించాలన్నారు. చుట్టూ ఉన్న ప్రపంచం వేగంగా మారిపోతోందని, ప్రతి రంగంలో కనిపిస్తున్న కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. 'మీ కథలను మీరే రాయండి. వాటిలో మీరే హీరోలుగా ఉండండి' అంటూ సలహా ఇచ్చారు.

పట్టుదలతోనే వికసిత్ భారత్

వికసిత్ భారత్ లక్ష్యం సాధించాలంటే విద్యార్థులకు కృషి, పట్టుదల అవసరమని బోర్డు ఆఫ్ గవర్నర్ ఛైర్మన్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఎండీ సజ్జన్ జిందాల్ అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ, సైన్స్ రంగంలో భారత ప్రభుత్వం చేపట్టిన కీలక కార్యక్రమాలపై దృష్టిపెట్టాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చెందుతున్న క్వాంటం వ్యాలీ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ వంటి ప్రాజెక్టులు ఈ ప్రాంతాన్ని టెక్నాలజీ స్ట్రాటజిక్ హబ్‌గా తీర్చిదిద్దుతాయని తెలిపారు. తిరుపతి ఐఐటీకి ప్రపంచ స్థాయి గుర్తింపు వస్తుందని డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ పేర్కొన్నారు. కొన్నేళ్లుగా అధ్యాపకులు నిర్వహించిన విద్యా కార్యకలాపాలు, పరిశోధనలను వివరించారు. ఈ ఏడాదిలో కోర్సులు పూర్తి చేసుకున్న 417మంది విద్యార్థులకు డిగ్రీలు అందజేశారు.

18 మందికి అవార్డులు

ప్రత్యేక ప్రతిభ కనబరచిన 18మంది విద్యార్థులకు వివిధ రకాల అవార్డులను ముఖ్య అతిథులు లక్ష్మీనారాయణన్, సజ్జన్ జిందాల్, ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ ప్రదానం చేశారు. అరవింద్ శ్రీనివాసన్‌కు ప్రెసిడెంట్ అవార్డు, మేఘవర్షిణికి గవర్నర్స్ ప్రైజ్, షేక్ మహ్మద్ అల్లాబక్ష్‌కు మొదటి డీన్స్ ప్రైజ్, పి.కుమార్‌మిశ్రాకు ఇన్‌స్టిట్యూట్ ప్రైజ్, మేఘవర్షిణికి కమటం కృష్ణయ్య అవార్డు, కొత్తపల్లి ఈశ్వర్ వెంకట సాయివర్మకు అసోసియేట్ ప్రైజ్, అరవింద్ శ్రీనివాసన్, కలం మదన్‌మోహన్, జైదీప్ రాయ, రితిక్‌మండల్, ఆదిత్యన్, గౌరవ్ త్రిపతికు ఇనిస్టిట్యూట్ ప్రైజ్, సుధాకర్ వెంకటాచలానికి అమరరాజా ప్రైజ్, శ్రుతికి ఐటీసీ లిమిటెడ్ ప్రైజ్, ఆకాశకు ప్రొఫెసర్ శ్రీనివాసన్ నటరాజన్ అవార్డు, అన్నయ్ మండల్‌కు ఆకురత్తి కుమారస్వామి సీతారావమ్మ మెమోరియల్ ప్రైజ్, చిరంజీవికి రామకృష్ణన్ ప్రైజ్ లభించాయి.

ప్రెసిడెంట్ అవార్డు రావడం ఆనందంగా ఉంది

417మందిలో నాకు ప్రెసిడెంట్ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉంది. మా తల్లిదండ్రుల కలలు నిజం చేసిన రోజు వచ్చిందని ఆనందంగా ఉంది.

- అరవింద్ శ్రీనివాసన్

పట్టుదల కృషితోనే సాధ్యం

పట్టుదల, కృషి, అధ్యాపకుల సహకారంతో గవర్నర్ ప్రైజ్ అందుకున్నా. దీంతో కృషితో దేన్నయినా సాధించవచ్చని నిరూపణ అయింది. వందమందిలో ప్రత్యేకంగా అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది.

- ఎం.మేఘవర్షిణి

గుడిపేరుతో క్షుద్రపూజలు

ఆక్రమణను ధ్వంసం చేసిన కొండూరు గ్రామస్తులు



స్థానికులకు సర్దిచెబుతున్న పోలీసులు

తడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గుడిపేరుతో క్షుద్రపూజలు నిర్వహిస్తూ గ్రామానికి అరిష్టం చేస్తున్నారంటూ కొండూరు గ్రామస్తులు ఆలయ ఆవరణాన్ని ధ్వంసం చేశారు. మండల పరిధిలోని కొండూరు గ్రామం జాతీయ రహదారి వెంబడి ఉన్న ప్రభుత్వ స్థలంలో ఓ వ్యక్తి చాముండేశ్వరి ఆలయం పేరుతో చిన్నపాటి తాత్కలిక గుడి నిర్మించారు. ఇందుకు గ్రామంలోని ఓ వర్గం మద్దతు తెలపగా మరోవర్గం వ్యతిరేకిస్తూ వచ్చింది. గుడిపేరుతో క్షుద్ర పూజలు చేస్తున్నారని ఆరోపిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసు కువెళ్లారు. ఆదివారం గ్రామస్తులు మూకుమ్మడిగా ఆ గుడివద్దకు చేరుకొని తాత్కలికంగా వేసిన షెడ్‌లను ధ్వంసం చేశారు. అనంతరం జాతీయ రహ దారిపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. తమ గ్రామంలో క్షుద్రపూజలు నిర్వహిస్తుండటంతో కొంతమంది చనిపోయారని, ఆ గుడిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని, వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు నచ్చచెప్పడంతో గ్రామస్తులు అక్కడ నుంచి వెనుతిరిగారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడదాం

గూడూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడదామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడంలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో మున్సిపల్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆగస్టు 7నుంచి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామన్నారు. ఈనెల 27న గూడూరులో జరగనున్న ఏఐటీయూసీ ప్లీనరి సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, నారాయణ, ఉదయ్‌కుమార్, చాముండేశ్వరి, సీవీఆర్ కుమార్, యాకోబు, గోపి, రాఘవులు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలింపు నిలిపివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు



యాకసిరి అటవీ ప్రాంతంలో గ్రావెల్ తరలించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సతీష్ కుమార్

చిట్టమూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): సాగరమాల రహదారి విస్తరణ పనులకు చిట్టమూరు మండలంలోని యాకసిరి అటవీ ప్రాంతం నుంచి గ్రావెల్ తరలింపును రద్దు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నాయుడుపేట, అన్నమేడు, విద్యానగర్ మీదుగా కృష్ణపట్నం వరకు నిర్మిస్తున్న సాగరమాల రహదారి పనులకు యాకసిరి రెవెన్యూ పరిధిలోని 425 సర్వే నెంబర్ నుంచి గ్రావెల్ తరలించేందుకు రెండు నెలల క్రితం తహసీల్దారు అనుమతి ఇచ్చారు. దీనిపై యాకసిరి గ్రామానికి చెందిన సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో తహల్దారు ఇచ్చిన అనుమతులను రద్దు హైకోర్టు రద్దు చేసింది. ఆదివారం న్యాయస్థానం నుంచి ఉత్తర్వులు అందడంతో తహసీల్దారు సతీష్ కుమార్, రీ సర్వే డీటీ నిరంజన్ కుమార్, ఆర్ఐ సుధ గ్రావెల్ తరలింపును నిలిపివేశారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

చిల్లకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేడిమాల గ్రామానికి చెందిన వరలక్ష్మి అనే విద్యార్థినికి రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 50వేల ఆర్థికసాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రాజనేని రామయ్యనాయుడు మాట్లాడుతూ వరలక్ష్మి పదో తరగతిలో 550 మార్కులతో ఉత్తీర్ణత సాధించిందన్నారు. ఉన్నత చదువులు చదువుకునేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో ట్రస్ట్ ఫౌండర్ శ్రీనివాసులు నాయుడు దృష్టికి తీసుకువెళ్లడంతో రూ.50వేలు అందజేశారని చెప్పారు. ఈ నగదును ట్రస్ట్ అధ్యక్షుడు రాజనేని పిచ్చయ్యనాయుడు చేతుల మీదుగా విద్యార్థినికి అందజేశామన్నారు. కార్యక్రమంలో పిచ్చయ్యనాయుడు, చంద్రశేఖర్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

తడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక బోడిలింగాలపాడుకు చెందిన అయ్యంగోళం ధనుష్ ఆదివారం జాతీయ రహదారి వద్దకు వచ్చాడు. తిరిగివెళ్తూ రోడ్డు దాటుతుండగా చెన్నై వైపు వెళ్తున్న ఓ కారు అతనిని ఢీకొంది. గాయపడిన ధనుష్‌ను స్థానికులు సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యంగా నివేదించారు. ఆలయం ఎదుట త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శాకాంబరి అలంకారంలో కన్యకా పరమేశ్వరి

కోట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కోటలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరిని ఆదివారం వేదపండితులు శాకాంబరిగా అలంకరించారు. ఆషాఢ మాసాన్ని పురస్క రించుకొని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. 51 రకాల కూరగాయలతో అలంక రించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ నాగరాజు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నెల్లూరుపల్లిలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

కోట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి, కొత్తపాళెం, గ్రామాల్లో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నారాయణతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాయిలమ్మ గ్రామోత్సవం

కోట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామంలో జరుగుతున్న గ్రామ దేవత వాయిలమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. మేళతాళాలతో అమ్మవారిని ఊరేగారు. మత్స్యకారాలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కారును ఢీకొన్న బస్సు

నాయుడుపేట టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మల్లాం జంక్షన్ జాతీయ రహదారి కూడలి వద్ద కారును ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఆదివారం చెన్నై నుంచి వరంగల్ వెళ్తున్న కారును మల్లాం జంక్షన్ మలుపు వద్ద బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతింది. ఎయిర్ బెలూన్ తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

దాడికి పాల్పడిన ఏడుగురిపై కేసు

పెళ్లకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లి దళితవాడలో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. దళితవాడకు చెందిన బాలకృష్ణపై అదే గ్రామానికి చెందిన లోకేష్, చలపతి, రమణమ్మ తదితరులు దాడికి పాల్పడి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏడుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

యువకుడి ఆత్మహత్య



నాయుడుపేట టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మూరు సమీపంలో ఆలయం వెనుక చెట్టుకు ఉరివేసుకొని గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం చెట్టుకు ఉరివేసుకున్న వ్యక్తిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





తొణుకుమాల సమీపంలో నిర్మిస్తున్న సాగరమాల రోడ్డు - అండర్‌పాస్ నిర్మించాలని డిమాండ్ చేస్తున్న స్థానికులు (ఫైల్‌ఫొటో)

అండర్‌పాస్ నిర్మించకపోతే అవస్థలే!

చిల్లకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొణుకుమాల, ఉడతావారిపార్లపల్లి, తిక్కవరం గ్రామాలకు సమీపంలోని సాగరమాల రహదారిపై అండర్‌పాస్ నిర్మించకపోతే రాకపోకలు సాగించేందుకు అవస్థలు తప్పవని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని తొణుకుమాల, తిక్కవరం, ఉడతావారిపార్లపల్లి గ్రామాల సమీపంలో సాగరమాల రహదారి పనులు జరుగుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు అండర్‌పాస్ నిర్మించడం లేదని, దీంతో తమకు దీర్ఘకాలిక అవస్థలు తప్పవని అంటున్నారు. ప్రధానంగా తొణుకుమాల, ఉడతావారిపార్లపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు తిక్కవరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లిరావాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు. అండర్‌పాస్ లేకపోతే సుమారు మూడు కిలోమీటర్లు వరకు చుట్టుతిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంటుందని, విద్యార్థులతో పాటు పలు పనుల నిమిత్తం తిక్కవరం గ్రామానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సివస్తుందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. అదేవిధంగా యోగేశ్వరపల్లిలోని కొంత మంది రైతులకు తొణమాల సమీపంలోని పొలాలు ఉండడంతో వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సివస్తుందని అంటున్నారు. అండర్‌పాస్ నిర్మించాలని ఇటీవల ఆయా గ్రామాల ప్రజలు రోడ్డుపై ఆందోళన చేపట్టి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు స్పందించి అండర్‌పాస్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సర్టిఫికెట్లపై ప్రభుత్వ చిహ్నాలే ఉంటాయ్: మంత్రి సంధ్యారాణి

నాయుడుపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రజలకు జారీచేసే సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలు, భూములు పాస్ పుస్తకాలపై రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాలే ఉంటాయని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఆదివారం నాయుడుపేట ఏఎంసీ గోదాము ప్రాంగణంలో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతే తరతరాలుగా, వంశపారపర్యంగా వస్తున్న భూముల పాస్ పుస్తకాలతో పాటు అన్ని సర్టిఫికెట్లపై గత వైసీపీ ప్రభుత్వం దిష్టిబొమ్మల్లా ఫొటోలు ముద్రించిందని విమర్శించారు. అవినీతి, అరాచక పాలనను భరించలేక ప్రజలు ప్రతిపక్ష హోదా లేకుండా కేవలం 11 సీట్లకే పరి మితం చేశారన్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి పేరుతో కుటుంబంలో ఒక్క బిడ్డకే సంక్షేమం అందజేస్తే, ఎన్డీఏ ప్రభుత్వంలో తల్లికి వందనంతో కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నా ఒక్కొక్కరికి రూ.13వేల చొప్పున అందజేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించి కేవలం రూ.5కే మూడు పూట్లా సంతృప్తికరమైన ఆహారం అందిస్తున్నారని చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం జరుగు తుందన్నారు. టీటీడీ బోర్డు సభ్యురాలు, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ, జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, అరవపెరిమిడి చంద్రారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్లు ఉయ్యాల ప్రవీణ్, ఆకుతోట రమేష్, మండల అధ్యక్షుడు సంచి కృష్ణ య్య, విజయమోహన్ నాయుడు, వేమసాని శ్రీనివాసులు నాయుడు, మాజీ జడ్పీటీసీ శ్రీరాం ప్రసాద్, మధుసూదనరెడ్డి, షైలారి రాజశేఖర్, దార్ల రాజేంద్ర, పొట్లపూడి రాజేష్, మొండెం బాబు, మాజీ ఎంపీపీ కన్నెమ్మ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనను వివరించండి: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఎల్ఆర్ కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 80శాతం అమలు చేసిందన్నారు. ఏడాదిలో ఎంతో అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, ఇవన్నీ ప్రజలకు వివరించాలన్నారు. చేసిన అభివృద్ధిని చెప్పుకోకపోడం వల్లే 2019లో ఓడిపోవాల్సి వచ్చిందని చెప్పారు. ఆ పరిస్థితి పునరావృతంగా కాకుండా ఉండాలంటే పార్టీలో అందరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. కష్టపడి పనిచేస్తే పార్టీలో గుర్తింపు ఉంటుందని, వైసీపీ చేస్తున్న కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నిలను దృష్టిలో ఉంచుకొని సమర్థవంతమైన వ్యక్తులతో కమిటీలు ఏర్పాటు చేయాలని పార్టీ అధిష్టానం నిర్ణయించిందని నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు జన్ని రమణయ్య చెప్పారు. అందరూ సమష్టిగా కృషిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని డీసీఎంఎస్ ఛైర్మన్ గంగోటి నాగేశ్వరరావు అన్నారు. సమావేశంలో పార్టీ పరిశీలకులు బొమ్మిని పళని, నారాయణరెడ్డి, మాధవరావు, బాబు నాయుడు, ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు, పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ శ్రీరాందాస్ గంగాధర్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి, రాపూరు, సైదాపురం మండలాల అధ్యక్షులు పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, రావి మస్తాన్ నాయుడు, దందోలు వెంకటేశ్వర్లు రెడ్డి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలి: పాశిం

గూడూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే కేసులు పెట్టకుండా ఊరుకోవాలా అని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో పోలీసులకు అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులను వేధిస్తూ అక్రమలు కేసులు పెట్టారన్నారు. తాము అధికారంలో ఉన్నా ఈ తరహా చర్యలకు పాల్పడలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం సిలికా, క్వార్ట్జ్ అక్రమ మైనింగ్‌ను యథేచ్ఛగా కొనసాగించారన్నారు. తాను నిత్యం ప్రజల్లోనే ఉంటానని, దీనిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, జహంగీర్, సిద్దయ్యనాయుడు, రవీంద్రరెడ్డి, ఇశ్రాయిల్ కుమార్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్





నాయుడుపేటలో వేలాయుధాలతో నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు - తడలో కావడితో వెళ్తున్న భక్తులు


వైభవంగా ఆడికృత్తిక వేడుకలు

చిట్టమూరు, జులై 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లాంలో వెలసిన స్వయంభు వళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ చెర్మన్ కామిరెడ్డి మునిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆడికృత్తిక వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, గణపతి హోమం, స్వయంభు మూర్తికి పాలాభిషేకం, అష్టోత్తర కలిశాభిషేకం, అమృతాభిషేకం నిర్వహించారు. నూరు స్తంభాల కల్యాణ మండపంలో జరిగిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకాల్లో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అదేవిధంగా అరవపాళెం సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో నిర్వాహకులు కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆడికృత్తిక వేడుకలు జరిగాయి.

కోట: పట్టణ పరిధిలోని కొక్కుపాడు సమీపంలో ఉన్న బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పలువురు కావిడిలు ఎత్తుకొని హరోహర నామాలతో ఆలయం చుట్టు ప్రదక్షణలు చేశారు. కోట పట్టణానికి చెందిన సారంగం సురేష్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా ఆడికృత్తిక మహోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం నుంచి భక్తులు 108 వేలాయుధాలతో పట్టణ పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు.

తడ: మండల పరిధిలోని చిన్నమాంబట్టులో ఉన్నకాశీవిశ్వేశ్వర అన్నపూర్ణదేవి ఆలయంలో ఆడికృత్తిక వేడుకలు నిర్వహించారు. తిరుపతి సిమ్స్ వైద్యుడు కారణి మునస్వామి ఆధ్వర్యంలో భక్తులు కావళ్లను మోసుకుంటూ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గోపూజ జరిగింది.





చిట్టమూరు: గ్రామోత్సవంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి - కోట: విశేష అలంకారంలో బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి

దివ్యాంగులకు కూరగాయల పంపిణీ

గూడూరు అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేద్కర్ నగర్ సమీపంలోని ఓ పెట్రోలు బంకు వద్ద ఆదివారం జేవీవీ ఆధ్వర్యంలో వెంకటనారాయణ దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెంచునారాయణ, నాగరాజు, పురుషోత్తమరావు, సుమన్ రెడ్డి, రాధయ్య, శ్రీనివాసాచారి, అరుణ్‌కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త రాజ్యాంగం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో మాజీ ఎంపీ నెలవల, రచయిత పేర్నాటి తదితరులు

నాయుడుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): 'స్వతంత్ర భారతదేశం-రాజ్యాంగ నిర్మాణం' పేరిట న్యాయవాది పేర్నాటి వెంకటేశ్వర్లు రచించిన సంక్షిప్త రాజ్యాంగం పుస్తకాన్ని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. ఆదివారం నాయుడుపేటలోని ఎంకే కన్వెన్షన్ హాలులో పుస్తకావిష్కరణలో నెలవల మాట్లాడుతూ 395 ఆర్టికల్స్‌తో 1500 పేజీలున్న రాజ్యాంగాన్ని 142పేజీలతో సంక్షిప్తంగా రచించిన పేర్నాటి వెంకటేశ్వర్లును అభినందించారు. రాజ్యాంగాన్ని క్షుణ్ణంగా అభ్యసించి అందరికీ అర్థమయ్యేరీతిలో రచించిన ఈ పుస్తకం భావితరాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఎంఈవో మునిరత్నం, రామచంద్రారెడ్డి, మాజీ ఎంఈవో శ్రీనివాసులు, బందిల మోహన్, ట్రినేటి సూపర్ స్పెషాలిటీ సీఈవో నాగూరయ్య, రామకృష్ణ, సుధాకర్, న్యాయవాది చదలవాడ కుమార్, సీవీరామన్ డైరెక్టర్ గోపీ, నవోదయ పద్మనాభరెడ్డి, శ్రీవేమ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ సేవలో మంత్రి సంధ్యారాణి



మంత్రి సంధ్యారాణికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న సహాయ కమిషన్ ప్రసన్న లక్ష్మి, పక్కన ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల తదితరులు

సూళ్లూరుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ పరమేశ్వరిని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదివారం దర్శించుకున్నారు. మంత్రికి ఆలయం వద్ద ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, నాయకులు చిట్టేటి పెరుమాల్, అలవల శ్రీనివాసులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల మంజూరు చేయండి

పెళ్లకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలానికి గురుకుల పాఠశాలను మంజూరు చేయాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణికి టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. మండలంలో గురుకుల పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు అత్యధికంగా ఉన్న పెళ్లకూరు మండలానికి గురుకుల పాఠశాలను మంజూరు చేయాలని కోరారు.